తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice
వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
09-05-2026
శనివారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 96
PUBLISHED FROM HYDERABAD
పేజీలు-8 వెల:రూ.4 /–

## గంగకత్వ కాలువ ఆధునీకరణకు ప్రభుత్వం సమ్మతి



- జగ్గారెడ్డి కోరిక మేరకు రూ.42 కోట్ల విడుదలకు ప్రభుత్వం అంగీకారం
- దశాబ్దాలుగా ఆధునీకరణ కు నోచుకోని నిజాం కాలం నాటి గంగ కత్వ కాలువ
- ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆ శాఖ ఉన్నతాధికారుల తో సెక్రటేరియట్ లో సమావేశమైన జగ్గారెడ్డి
- గంగకత్వ ఆధునీకరణ పనులకు త్వరలో సీఎం రేవంత్ రెడ్డి తో శంఖుస్థాపన

6




# జూన్ 2న రైతు డిస్కం?

### తీరని విద్యుత్ ఉద్యోగుల సందేహాలు

- అసలెందుకు కొత్త విభజన అంటూ విమర్శలు
- అభ్యంతరాల మధ్యే అధికారుల కసరత్తు
- ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపినా వీడని చిక్కుముడి
- ప్రమోషన్ల 'ఎర' వేసినా వెనకడుగు వేస్తున్న సిబ్బంది
- ఆస్తులు, అప్పుల పంపకంలో అంతుచిక్కని లెక్కలు
- క్షేత్రస్థాయిలో సమన్వయం లేక ప్రమాదంలో నిర్వహణ
- మేధావుల హెచ్చరికలను బేఖాతరు చేస్తున్న సర్కారు

**తెలంగాణ బ్యూరో సిరి న్యూస్:**
రైతులకోసం ఒక ప్రత్యేక డిస్కమ్ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ విధానాన్ని అభ్యంతరాలు ఆక్షేపణలు వ్యతిరేకతల మధ్య ఎలాగైనా ప్రారంభించాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. తెలంగాణ విద్యుత్ శాఖలో ఇప్పటికే విద్యుత్ పంపిణీ కంపెనీలు రెండు ఉండగా ఉచిత పథకాలన్నీ ఒక చోట చేసి కొత్త డిస్కం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా అవసరమైన ఉద్యోగుల జాబితా, పంచాల్సిన ఆస్తులు అప్పులు నిర్ణయించారు. అప్పుడే కొత్త డిస్కమ్ పై లెక్కలేనన్ని అనుమానాలు

మిగతా 2వ పేజీలో..

# కొడంగల్‌ను నందనవనంగా మారుస్తా



- దేశం మొత్తం నియోజకవర్గం వైపు చూసేలా అభివృద్ధి
- విద్యా హబ్‌గా లగచర్ల.. 6 నెలల్లో సిమెంట్ పరిశ్రమలు
- ఏడాదిన్నరలోపు 'కొడంగల్‌నారాయణపేట' ఎత్తిపోతల పూర్తి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కొడంగల్‌లో 430 పడకల హాస్పిటల్ నిర్మాణానికి శంకుస్థాపన
- మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం

**కొడంగల్ మే 8 సిరి న్యూస్::**
"దేశం మొత్తం కొడంగల్ వైపు చూసేలా ఈ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామని, అందరి సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడుపుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించిన ఆయన.. 430 పడకల ఆసుపత్రి నిర్మాణం, దౌల్తాబాద్ వేంకటేశ్వర ఆలయం, కోస్గి వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో సీఎం ఉద్వేగభరితంగా ప్రసంగించారు.
దేశం మొత్తం కొడంగల్ వైపు చూసేలా

మిగతా 2వ పేజీలో..

### మైనారిటీల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ డిగ్రీ కళాశాలలు

- మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు
- మూసీ అభివృద్ధిలో గుడితో పాటు మసీదు, చర్చి, గురుద్వారాల నిర్మాణం
- మైనారిటీ సంక్షేమ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

2



## శాంతిభద్రతల రక్షణలో రేవంత్ సర్కార్ అట్టర్ ఫ్లాప్



- ఎన్‌సీఆర్‌బీ గణాంకాలతో బట్టబయలైన భయానక పరిస్థితి
- దేశంలోనే 'సైబర్ నేరాల' అడ్డాగా మన రాష్ట్రం..
- హోంమంత్రిగానూ ముఖ్యమంత్రి పూర్తిగా విఫలం
- మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ధ్వజం

2



## ఆగస్టు నాటికి మూసీ పునరుజ్జీవ పనులు

- తొలి దశలో రూ.7,055 కోట్లతో అభివృద్ధి.. 2027 డిసెంబర్ నాటికి పూర్తి
- మనుషులను దూరం చేయం.. భాగస్వాములను చేస్తాం: సబ్ కమిటీ స్పష్టం
- ప్రజల ఆస్తులకు నష్టం కలగకుండా అలైన్‌మెంట్‌లో మార్పులు
- రబ్బర్ డ్యామ్ నమూనాను పరిశీలించిన మంత్రులు భట్టి, శ్రీధర్ బాబు, పొన్నం

3



## తెలంగాణలో శాంతిభద్రతలు క్షీణించాయి..

- కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు!
- నరగంలో వరుస హత్యలు ఆందోళనకరం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు

**హైదరాబాద్, మే8 సిరి న్యూస్::**
రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో శాంతిభద్రతలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (KTR) తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వరుసగా జరుగుతున్న ఘోరమైన నేరాల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం

మిగతా 2వ పేజీలో..



## ఏ అధికారంతోని భూమి పూజా చేద్దామనుకున్నారు..?

- ప్రోటోకాల్ గురించి మీకు తెలియదా.?
- ఉప్పల్ ఎమ్మెల్యేను నిలదీసిన హైడ్రా కమిషనర్ రంగనాథ్..
- కాప్రా కాంగ్రెస్ నేతల ఫిర్యాదుపై స్పందించిన కమిషనర్..

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 08 సిరి న్యూస్::**
ఏ అధికారంతోని కాప్రా చెరువులో భూమి పూజా చేద్దామనుకున్నారు..?? ప్రోటోకాల్ గురించి మీకు తెలియదా.? అంటూ

మిగతా 2వ పేజీలో..

# ఆర్టిజన్ల డిమాండ్లపై ప్రభుత్వ హామీ వాయిదా



- జాక్ లేవనెత్తిన అంశాలపై మరోసారి కలుద్దామన్న అధికారులు
- మాట ఇచ్చి తప్పడంపై ఉద్యోగుల్లో అసంతృప్తి!
- పవర్ జాక్ పెద్దన్న పాత్రను వద్దనడమే తప్పయిందా!
- అధైర్య పడొద్దన్న టీజాక్ కన్వీనర్ సతీష్ రెడ్డి

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**
షరతులు లేకుండా సమ్మె విరమించారు. డిమాండ్ల సాధనకు ఒక వైపు అధికారులు, మరో వైపు కాంగ్రెస్ నేతలు సహకరించారు. సాక్షాత్తు ఉప ముఖ్యమంత్రి భట్టి హామీ ఇచ్చారు. కానీ విద్యుత్ ఆర్టీసియన్ల సమస్యలు మాత్రం చర్చల వరకే పరిమితం అవుతున్నాయ్. దింతో నేడైన చర్చలు కొలికొచ్చి తమ డిమాండ్లు నెరవేరుతాయనుకున్న ఆర్టీసన్ల ఆశలు అడియాశలయ్యాయ్. తెలంగాణ విద్యుత్ శాఖలో తక్కువ జీతం ఎక్కువ భారం తో జీవితాన్ని గడుపుతున్న ఆర్టిసన్లు గత నెలలో ఒకే సంస్థ ఒకే విధానం అనే నినాదంతో 10 రోజులు

మిగతా 3వ పేజీలో..

## ఐపీఎస్ అధికారి భార్య హత్య.. నేపాలీ గ్యాంగ్ పనే!

- చేతులు కట్టేసి, నోట్లో గుడ్డలు కుక్కి ఘాతుకం
- నేపాలీ గ్యాంగ్ పనే అని పోలీసుల అనుమానం
- క్లూస్ దొరికాయి.. త్వరలోనే పట్టుకుంటాం: సీపీ సజ్జనార్

2





## కేంద్ర నిధులతోనే గ్రామ పంచాయతీల నిర్వహణ

- తెలంగాణకు మోడీ ఏం తెస్తున్నారని ప్రశ్నించడం సరికాదు
- మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్

**తెలంగాణ బ్యూరో సిరి న్యూస్::**
రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులతోనే కొనసాగుతున్నాయని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. తెలంగాణకు ప్రధాని నరేంద్ర మోడీ ఏం తెస్తున్నారని కొందరు ప్రశ్నిస్తున్నారని, గ్రామ పంచాయతీలకు నిధులు అందిస్తున్నది ఎవరో ప్రజలు గమనించాలని

మిగతా 3వ పేజీలో..

# మైనారిటీల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ డిగ్రీ కళాశాలలు

**హైదరాబాద్, మే 8 :**
మైనారిటీ విద్యార్థుల కోసం ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని.. వాటిలో నైపుణాభివృద్ధి, ఏఐ శిక్షణకు ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. సంప్రదాయ కోర్సులు కాకుండా వారి జీవనోపాధికి ఉపయోగపడే శిక్షణ ఇప్పించాలన్నారు. మైనారిటీ సంక్షేమ శాఖ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో శుక్రవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ప్రతిభావంతులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఇస్తున్నట్లే మైనారిటీ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించాలని,ఇందు కోసం ప్రత్యేకంగా ఒక కార్యక్రమం ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. గ్రూప్1, గ్రూప్2, గ్రూప్3కి ఎంపికైన మైనారిటీ అభ్యర్థుల్లో ఆసక్తి ఉన్న వారిని ఎంపిక చేసి మైనారిటీ సంక్షేమ శాఖలో బాధ్యతలు అప్పగించి... ఆ శాఖ పరిధిలో చేపట్టే అన్ని కార్యక్రమాలపై పూర్తి అవగాహన కలిగించేలా వారిని తీర్చి దిద్దాలని సీఎం ఆదేశించారు. విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించే కార్యక్రమానికి గ్రూప్స్‌కు ఎంపికైన వారిని, క్రీడాకారులను ఆహ్వానించి విద్యా, క్రీడల ప్రాధాన్యతను వారికి తెలియజేయాలని సూచించారు.

ఇమామ్, మౌజమ్‌లకు ఇచ్చే గౌరవ పారితోషికాలను క్రమం తప్పకుండా విడుదల చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. మైనారిటీ పాఠశాలల్లో బోధనలో ఏఐకు ప్రాధాన్యమివ్వాలని సీఎం సూచించారు. భూ లభ్యత ఉన్న చోట ఖబరస్తాన్‌లకు స్థలాలను కేటాయిస్తామని సీఎం తెలిపారు. డీజిల్, పెట్రోల్ ఆటోలను ఎలక్ట్రిక్ ఇంజిన్లతో రీట్రోఫిట్టింగ్ చేయడం ద్వారా ఆటోడ్రైవర్లకు ఇంధన ఖర్చులు లేకుండా చేసి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఒక ప్రణాళిక రూపొందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

మూసీ రివర్ ఫ్రంట్‌లో భాగంగా గుడితో పాటు మసీద్, చర్చి, గురుద్వారా నిర్మాణాలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆయా మతాలకు సంబంధించిన సంస్కృతుల అధ్యయనం, భారత దేశ విశిష్టతను, తెలంగాణలోని గంగా జమునా తెహ్‌జీబ్ ను తెలియజేసేలా ఆ కట్టడాలు ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు. మన సంస్కృతులను అధ్యయనం చేసే గొప్ప అధ్యయన కేంద్రాలుగా అవి పరిఢవిల్లాలని సీఎం ఆకాంక్షించారు. సమీక్షలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలు) మహ్మద్ షబ్బీర్ అలీ, టీజీఎంఆర్ఈఐఎస్ ప్రెసిడెంట్ మహ్మద్ ఫహీముద్దీన్ ఖురేషీ, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, హజ్ కమిటీ ఛైర్మన్ సయ్యద్ గులామ్ అఫ్జల్ బియాబాని, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మహ్మద్ ఓబేదుల్లా కొత్వాల్, ఉర్దూ అకాడమీ ప్రెసిడెంట్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ దీపక్ జాన్ కొకడాన్, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా తదితరులు పాల్గొన్నారు.

# కొడంగల్‌ను నందనవనంగా మారుస్తా

**మొదటిపేజీ తరువాయి**
అభివృద్ధి చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పేదల సంక్షేమం కోసం తాము పనిచేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. శుక్రవారం వికారాబాద్ జిల్లాలోని సొంత నియోజకవర్గం కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. 430 పడకల హాస్పిట) నిర్మాణం, దౌల్తాబాద్ వేంకటేశ్వర ఆలయం, కోస్గి వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్ శ్రీ మహలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం చేయటం అదృష్టమని చెప్పుకొచ్చారు. తెలంగాణ పేదల తిరుపతిగా ఈ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఓవైపు గుడి.. మరోవైపు గడి ఏకమైన ఈ నియోజకవర్గాన్ని నందనవనంగా మార్చటానికి అందరు కలిసి రావటం అభినందనీయమని తెలిపారు. ఆగమశాస్త్ర పండితుడు సుందరవరదాచార్యులు కలలుగన్న గుడి నిర్మాణం సహకారం కావటం సంతోషమని చెప్పారు. తిరుపతిలో ఏ రకమైన పూజలు జరుగుతాయో ఇక్కడ అలాగే పూజలు జరుగుతాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ గుడికి కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు వస్తారని.. దీంతో కొడంగల్‌కు దేశంలో గుర్తింపు వస్తోందని తెలిపారు. కొడంగల్‌నారాయణపేట ఎత్తిపోతల పథకానికి భూసేకరణ పూర్తయిందని తెలిపారు ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి నిధుల కొరత లేదన్నారు. ఈ ఎత్తిపోతల పథకానికి భూసేకరణ పూర్తయిందని.. అనుమతులు వచ్చాయని, ఏడాదిన్నరలోపు పూర్తి చేద్దామని చెప్పుకొచ్చారు.

కృష్ణానదీ జలాలతో కొడంగల్ భూములు తడవాలన్నారు. కృష్ణా జలాలు ఇక్కడికి వచ్చే వరకు జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రి శ్రీహరిని నిద్ర పోనీయొద్దని స్థానిక నేతలకు సూచించారు. కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ నియోజకవర్గానికి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా మంత్రి పదవి దక్కలేదని, ఇప్పుడు కొడంగల్ ఎమ్మెల్యేనైన తనకు సీఎం పదవి దక్కిందన్నారు. కొడంగల్ నుంచే దౌల్తాబాద్, కోస్గి ఆలయాల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు.కృష్ణ వికారాబాద్ రైల్వేలైన్ త్వరలో పూర్తవుతుందని స్పష్టం చేశారు. రేకులపాడు ప్రాంతంలో సిమెంట్ పరిశ్రమలను ఆరు నెలల్లో ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని అన్నారు. 20 ఎకరాల్లో లగచర్ల వద్ద విద్యా హబ్‌గా మార్చుతున్నామని సీఎం ఉద్ఘాటించారు. ఇక్కడ అనేక విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. రాజకీయాలు ఎన్నికల సమయంలో ఉండాలని.. ఆ తర్వాత అందరం కలిసి పనిచేయాలని సూచించారు. 2034 వరకు గుంపులు, గ్రూపులు పక్కన పెట్టాలని.. అభివృద్ధికి బాటలు వేద్దామని పిలుపునిచ్చారు. కొడంగల్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకుందామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఏ అధికారంతోని భూమి పూజా చేద్దామనుకున్నారు..?


**మొదటిపేజీ తరువాయి**
ఉప్పల్ ఎమ్మెల్యేపై హైడ్రా కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సం విషయంలో మంత్రులు, జిల్లా మంత్రులు ఉంటారని మీకు తెలుసు కదా. వారిని ఎవరినీ కూడా కాదని మీరే ఎలా భూమి పూజా చేద్దామనుకున్నారంటూ ఎమ్మెల్యేను హైడ్రా కమిషనర్ నిలదీశారు కాప్రా చెరువు అభివృద్ధికి ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి రూ.35 కోట్ల నిధులను మంజూరు చేయించారు. త్వరలోనే జిల్లా ఇంఛార్జీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా భూమి పూజ చేసి పనులను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చెరువులో అభివృద్ధి పనులకు తానే భూమి పూజ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న కాప్రా కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి ఇదే విషయం చెప్పారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకొని వెంటనే ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి ఫోన్ చేసి పై



విధంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ ప్రకారమే భూమిపూజ జరుగుతుందని కాప్రా కాంగ్రెస్ నేతలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కొబ్బనూరి నాగశేషు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్, మాజీ కౌన్సిలర్ రాజేందర్ జిల్లా మాజీ ఏ ఎం సి కొబ్బనూరి నాగరాజు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పడమటి మల్లారెడ్డి,పొట్టు బాబురావు, జి సత్యనారాయణ, తన్నీరు శ్రీహరి, తోటకూర శ్రీకాంత్ గుణశేఖర్,రాజశీలన్ తదితరులు పాల్గొన్నారు

# జూన్ 2న రైతు డిస్కం?

**మొదటిపేజీ తరువాయి**
మొదలయ్యాయి. వాస్తవానికి ఇప్పుడు తెలంగాణలో ఉన్న రెండు డిస్కం ల లో పరిపాలన సౌలభ్యానికి అనుకూలంగా వ్యవస్థ ఉంది. ప్రస్తుతం ఉన్న డిస్కంలలో ఒకటి హైదరాబాద్ కేంద్రంగా మరొకటి వరంగల్ కేంద్రంగా పనిచేస్తున్నాయి .ఈ డిస్కం ల ఆధ్వర్యంలోనే ఇప్పటివరకు ఎల్టి, ఎచ్టీ , నిర్వహణ కొనసాగుతోంది.




**అవసరం లేకున్నా ఆస్తులు విభజించి**
విద్యుత్ శాఖలో ఉచిత పథకాల డిస్కమ్ గా ఏర్పాటు చేస్తున్న రైతు డిస్కం అనేది కేవలం ఉన్న రెండు డిస్కం లనుండి ఆస్తులను అప్పులను ఉద్యోగులను తీసుకొని ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా ప్రభుత్వం చెబుతుంది ఏంటంటే ఉచిత కరెంట్ వాడే వ్యవసాయ లైన్లు, మిషన్ భగీరత లాంటి పథకాలు వేరు చేస్తూ వాటికోసం మాత్రమే ఈ డిస్కం ఏర్పాటు చేస్తున్నామంటున్నారు.

**సమన్వయం ఎలా?**
వ్యవసాయ వినియోగదారులకోసం ఏర్పాటు చేసిన 5,22,479 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్లు,2,61,240 కిలోమీటర్ల ఎల్టీ లైన్ కొత్త డిస్కం పరిధిలోకి రానుంది.ప్రస్తుతం ఉన్న రెండు డిస్కం లు వీటి నిర్వహణ చూస్తుండగా ప్రసుత్తం వీటిని కొత్త రైతు డిస్కం కు బదిలీ చేస్తారట. వీటి విలువను 4929 కోట్లుగా లెక్కగట్టారు,అలాగే వీటి నిర్వహణకోసం ఉన్న రెండు డిస్కం ల నుండి 660 మంది ఇంజనీర్లను, 1000 మంది సిబ్బందిని, మరో 340 అదనంగా ఉద్యోగులను కేటాయిస్తున్నారు. మొత్తం 660 మండలాలకు విస్తరించి ఉన్న ఈ లైన్ల నిర్వహణకు కేవలం 2000 మంది ఎలా సరిపోతారని ఉద్యోగుల ఆక్షేపన,ఇప్పటివరకు డివిజన్ సర్కిల్ కేంద్రంగా జరిగిన పరిపాలన రైతు డిస్కం లో జోన్ కేంద్రంగా సాగనుంది. ఇది కూడా ఒక పెద్ద సమస్యే. జోన్ అంటే ఉమ్మడి మూడు జిల్లాలుగా ఉంటుంది. అలాంటప్పుడు క్షేత్ర స్థాయిలో పనిచేసే ఉద్యోగులను బదిలీ చేస్తే అ జోన్ పరిధిలో ఎక్కడికైనా వెళ్లాల్సిందే.దీనిని ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. అలాగే వేలాది సర్వీస్ కన్మెక్షన్లు వందల సంఖ్యలో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్ల నిర్వహణ సైతం ఒక్కరే చేయాల్సి రావడం మరో సమస్య. తక్కువ సిబ్బంది కేటాయించి వాటి నిర్వహణ సాధ్యం కానపుడు వాళ్ళనే బాధ్యులు చేస్తారు కదా అనేది ఉద్యోగ సంఘాల వాదన. ఇక పోతే కేవలం డిటీఆర్ ల నిర్వహణ, ఎల్టి లైన్ ల వరకే రైతు డిస్కం ల పని కావడంతో 11కేవీ ,33కేవీ లైన్లలో సాంకేతిక సమస్యలు ఏర్పడినపుడు రెండు డిస్కామ్ ల ఉద్యోగుల మధ్య సమన్వయము ఎలా అన్నది పెద్ద సమస్య.అలాగే కొత్త ఉచిత సర్వీసులు ఎలా ఇస్తారు. ట్రాన్సఫార్మర్ల రిపేర్ సెంటర్ల నిర్వహణ, ఉచిత లైన్ల మరమ్మతుకు కావాల్సిన సామాగ్రికి ప్రత్యేక స్టోర్ ఉంటుందా? ఇలా లెక్క లేనన్ని అనుమానాలకు సమాధానం లేకుండానే డిస్కామ్ ఏర్పాటు పై ముందుకు పోతున్నారన్న విమర్శలు ఉన్నాయ్.

**ఉద్యోగుల భద్రత ఎలా?**
కొత్తగా ఏర్పాటు చేస్తున్న రైతు డిస్కామ్ లకు వెళ్ళే ఉద్యోగులకు యాజమాన్యం పదోన్నతి అనే ఎర వేసింది. ఇందులోకి వచ్చే వారికీ వారు చేస్తున్న హోదా కంటే పై హోదా ఇస్తామని యాజమాన్యం కొత్త జీవో లో పేర్కొంది.కానీ ఉద్యోగుల పెన్షన్ విధానం జీతభత్యాలు,పిఅర్సి లాంటివి ఏ ప్రాతిపదికన ఇస్తారో ఇప్పటికి వివరణ లేదు. గతంలో విద్యుత్ బోర్డు ను సంస్కరణలు తెచ్చి విభజించినపుడు ఉద్యోగ సంఘాల కృషితో ఒక ట్రస్ట్ ఏర్పాటు చేసి పదవి విరమణ అనంతరం ఎలాంటి ఆర్థిక సమస్యలు తలెత్తకుండా చేసారు. కానీ అదే తీరుగా కొత్త డిస్కామ్ లో ఉంటుందని ఎక్కడ వివరించలేదు.

**వద్దని వారిస్తున్నా మొండిగా ముందుకు**
కొత్త డిస్కామ్ ఏర్పాటు లాబాటనష్టాలపై ఇప్పటికే అటు ఉద్యోగ సంఘాలతో ఎన్నో సార్లు చర్చలు జరిగాయి. అందులో కొత్త డిస్కామ్ ఏర్పాటు లాభాలపై ఎక్కడ యాజమాన్యం సరైన వివరణ ఇవ్వలేదు. ఏదైనా వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నపుడు దూరదృష్టితో అలోచించి చేస్తారు. కానీ రైతు డిస్కామ్ మాత్రం కేవలం ఉచితాల డిస్కామ్ గా ఏర్పాటు చేసారు. ఇది ఉన్న ఆస్తులను అప్పులను, ఉద్యోగులను బదలాయించి ఏమాత్రం కొత్త ప్రయోజనం లేకుండా ఏర్పాటు చేస్తున్న డిస్కామ్ అని విద్యుత్ రంగ నిపుణుల వాదన. సంస్థ ఏర్పాటు మూలంగా కొత్తగా జరిగేది ఎం ఉండదని కానీ లెక్కలేని సమస్యలకు కేంద్రం కానున్నాదన్నది వారి వాదన. ఏది ఏమైనా సర్కారు జీవో ఇచ్చింది. మేము ఏర్పాటు చేస్తామన్నట్టు అధికారులు హడావిడి ఇలా కొనసాగుతోంది.

# తెలంగాణలో శాంతిభద్రతలు క్షీణించాయి..

**మొదటిపేజీ తరువాయి**
చేశారు. పోలీస్ యంత్రాంగం మొత్తాన్ని రాజకీయ కక్షసాధింపులు, ప్రతిపక్ష నాయకులను వేధించడం కోసమే మళ్లించడం వల్లనే, ప్రజల రక్షణ, భద్రత గాలిలో కలిసిపోయిందని విమర్శించారు.

శాంతిభద్రతల క్షీణతపై బీఆర్ఎస్ ప్రతినిధి బృందం డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తున్న సమయంలోనే అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే హైదరాబాద్‌లోని ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ ర్యాంక్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రాయ్ భార్య అత్యంత దారుణంగా హత్యకు గురైన వార్త రావడం దిగ్భ్రాతికరమని పేర్కొన్నారు. అంతేకాకుండా, నిన్న రాత్రి సికింద్రాబాద్‌లో నడిరోడ్డుపై ఒక యువకుడిని అతి దారుణంగా కత్తితో పొడిచి చంపిన ఘటన నగరాన్ని ఉలిక్కిపడేలా చేసిందని, ఇది సామాన్య పౌరుల్లో పెరుగుతున్న అభద్రతా భావానికి అద్దం పడుతోందని స్పష్టం చేశారు. నేరాల నివారణ, ప్రజా భద్రతపై దృష్టి పెట్టాల్సిన పోలీస్, ఇంటెలిజెన్స్ వ్యవస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ తీరును విమర్శించే సోషల్ డియా గొంతులపై అక్రమ కేసులు బనాయించేందుకు వాడుకుంటోందని ఆరోపించారు. 'పోలీస్ వ్యవస్థను రాజకీయ కక్షసాధింపు చర్యలకు వాడుకోవడం వల్లనే శాంతిభద్రతలు కుప్పకూలాయని' స్పష్టం చేశారు. తెలంగాణలో మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలు భారీగా పెరిగినట్లు తాజా ఎన్‌సీఆర్‌బీ నివేదికలు చెబుతున్నాయని, ఇది ప్రస్తుత ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని కేటీఆర్ గుర్తుచేశారు. హోం శాఖను కూడా తన వద్దే ఉంచుకున్న రేవంత్ రెడ్డి ప్రజల ఆస్తిపాస్తులను, ప్రాణాలను రక్షించడంలోనూ, శాంతిభద్రతలను కాపాడటంలోనూ ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రాజకీయ వేధింపులు ఆపి, పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని, ప్రజల్లో భరోసా కల్పించేలా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు.




# ఐపీఎస్ అధికారి భార్య హత్య.. నేపాలీ గ్యాంగ్ పనే!

**హైదరాబాద్, మే 8:**
జూబ్లీహిల్స్‌లోని ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ వినయ్ రంజన్ రాయ్ సతీమణి తనుజా (55) హత్యకు గురయ్యారు. ఈ హత్యకు సంబంధించిన వివరాలపై హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. రిటైర్డ్ డీజీ సతీమణి తనూజ హత్యకు గురైందని తమకు సమాచారం వచ్చిందని తెలిపారు. రిటైర్డ్ డీజీ భార్య తనుజాను గురువారం రాత్రి రెండు గంటలకు దుండగులు హత్య చేశారని తెలిపారు.

నేపాలి గ్యాంగ్ పనిగా ప్రాథమికంగా తాము ఒక అంచనాకు వచ్చామని అన్నారు. కొన్ని క్లూస్ లభించాయని.. ఆ క్లూస్ ఆధారంగా ఈ కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నేపాలి పనివాళ్లపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేపాలి పనిమనుషులు ఇంట్లో ఎవరూ లేనప్పుడు నేరాలకు పాల్పడుతున్నారని సీపీ సజ్జనార్ వెల్లడించారు. గురువారం రాత్రి రిటైర్డ్ డీజీ ఇంట్లో ఎవరు లేనప్పుడు పనిమనిషి కల్పన అనే మహిళ మరి కొందరితో కలిసి ఈ దారుణం చేసిందని తెలిపారు. ఈ ఘటన సమయంలో పిల్లలు ఇద్దరు పై ఫ్లోర్‌లో ఉన్నారని.. తనుజ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్నారని వెల్లడించారు. ఇంట్లో ఉన్న పనిమనిషి కల్పనతో బయట వ్యక్తులు కాంటాక్ట్ పెట్టుకొని ఈ క్రైమ్ చేశారని చెప్పారు. ప్రజలు భయాందోళనకు గురికావొద్దని.. నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు. నేపాలి పనిమనుషులు ఇంట్లో ఏడాది, రెండో ఏడాది పనిచేసిన కూడా వాళ్లపై నిఘా ఉంచాలని సీపీ సజ్జనార్ అన్నారు. ఈ కేసును చాలా సీరియస్‌గా తీసుకుంటున్నామని తెలిపారు. చేతులు కట్టేసి నోట్లో గుడ్డలు కుక్కి ఆమెను ఈ గ్యాంగ్ హత్య చేసిందని చెప్పారు. రిటైర్డ్ డీజీ తల్లి కోసం ఆమె హైదరాబాద్ వచ్చారని తెలిపారు. ఇటీవల రిటైర్డ్ డీజీ తల్లి మరణించారని.. అప్పటి నుంచి తనుజ ఇక్కడే ఉంటున్నారని వివరించారు. ఈ కేసులో ఎంత బంగారం, నగదు పోయిందనే అంశాలపై ఆరా తీస్తున్నామని తెలిపారు. నిందితులు బ్యాక్ గేట్ నుంచి ఇంట్లోకి ప్రవేశించారని.. ఘటన అనంతరం వెనుక నుంచి పారిపోయారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.



# శాంతిభద్రతల రక్షణలో రేవంత్ సర్కార్ అట్టర్ ఫ్లాప్

**హైదరాబాద్, మే 8 :**
రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని, ముఖ్యమంత్రిగా మాత్రమే కాకుండా హోంమంత్రిగా కూడా రేవంత్ రెడ్డి అట్టర్ ఫ్లాప్ అయ్యారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు (MLA Harish Rao) తీవ్రంగా విమర్శించారు. 2024 ఎన్‌సీఆర్‌బీ గణాంకాలే (NCRB 2024 Data) తెలంగాణలో నేరాల పెరుగుదలకు నిలువుటద్దమని ఆయన పేర్కొన్నారు. 2024 ఎన్‌సీఆర్‌బీ గణాంకాలు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణలో శాంతిభద్రతల పరిస్థితి పూర్తిగా క్షీణించిందన్న వాస్తవాన్ని బయటపెట్టాయని అన్నారు.

దేశంలోనే అత్యధిక సైబర్ నేరాలు నమోదవుతున్న రాష్ట్రంగా తెలంగాణ మారడం అత్యంత ఆందోళనకరమన్నారు. 2024లో తెలంగాణలో 27,230 సైబర్ నేరాలు నమోదయ్యాయని, ఇది దేశవ్యాప్తంగా నమోదైన కేసుల్లో గణనీయమైన శాతమని తెలిపారు. 2023తో పోలిస్తే సైబర్ నేరాలు దాదాపు 49 శాతం పెరగడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. హైదరాబాద్ దేశంలోనే అత్యధిక సైబర్ నేరాలు నమోదవుతున్న నగరాల్లో ఒకటిగా మారిందన్నారు. రాష్ట్రంలో మిస్సింగ్ కేసులు కూడా భయానకంగా పెరిగాయని హరీశ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. 2024లో తెలంగాణలో 25,500 మంది మిస్సింగ్ కేసులు నమోదవగా, వారిలో వేలాది మంది ఇప్పటికీ ఆచూకీ లభించలేదన్నారు. ప్రతి రోజు సగటున ఆరుగురు చిన్నారులు అదృశ్యమవుతున్న పరిస్థితి నెలకొనడం దారుణమన్నారు.

చిన్నారులపై నేరాలు కూడా భారీగా పెరిగాయని తెలిపారు. 2024లో రాష్ట్రంలో చిన్నారులపై 6,767 కేసులు నమోదయ్యాయని, కిడ్నాప్‌కు గురైన చిన్నారుల్లో అధిక శాతం బాలికలేనని చెప్పారు. మహిళలపై నేరాలు పెరిగాయని, 2022లో 22,066 కేసులు ఉండగా 2024లో అవి 24,495కు పెరిగాయని పేర్కొన్నారు. మానవ అక్రమ రవాణా కేసుల్లో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలవడం రాష్ట్ర పోలీస్ వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో 2024లో 423 మానవ అక్రమ రవాణా కేసులు నమోదు కావడం అత్యంత ఆందోళనకరమన్నారు. రాష్ట్రంలో మొత్తం కాగ్నిజబుల్ నేరాలు కూడా భారీగా పెరిగాయని తెలిపారు. 2022లో 1,65,830 కేసులు ఉండగా, 2024 నాటికి అవి 2,17,976కు చేరుకున్నాయని అన్నారు. ప్రతి లక్ష జనాభాకు తెలంగాణలో నేరాల రేటు 568.9గా ఉండగా, దేశ సగటు 418.9 మాత్రమే ఉండటం రాష్ట్ర పరిస్థితిని స్పష్టంగా చూపిస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలపై దాడులు పెరగడం, మహిళలు మరియు చిన్నారుల భద్రత క్షీణించడం రాష్ట్రంలో శాంతిభద్రతల వైఫల్యానికి నిదర్శనమన్నారు. వేలాది సైబర్ నేరాల కేసులు, మిస్సింగ్ కేసులు ఇప్పటికీ పరిష్కారం కాకపోవడం దారుణమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అత్యంత క్లిష్టమైన కేసులను కూడా వేగంగా చేధించేవారని, కానీ ప్రస్తుతం కరీంనగర్‌లో జరిగిన పట్టపగలు నగల దుకాణం దోపిడీ ఘటనలో నిందితులను ఇప్పటికీ పట్టుకోలేకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమన్నారు.

**రాజకీయ ప్రచారం కోసం ప్రజలను బలి చేయొద్దు..**
పట్టపగలు, ప్రజల ముందే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలపై దాడులు జరుగుతున్నాయని, ఐఏఎస్ క్వార్టర్స్‌లో ఐపీఎస్ అధికారిణి భార్య హత్య వంటి ఘటనలు రాష్ట్రంలో క్షీణించిన శాంతి భద్రలకు నిదర్శనం అన్నారు. సీపీ సుమతి నిర్వహించిన ఆపరేషన్‌తో హైదరాబాద్‌లో మహిళల భద్రత ఎంత డొల్లగా మారిందో బయటపడిందన్నారు. జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్షలు నిర్వహించడం మాత్రమే కాకుండా, క్షేత్ర స్థాయిలో శాంతిభద్రతలను కాపాడటంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని హరీశ్ రావు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనితీరు పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం, రాజకీయ కక్షసాధింపు, మీడియా మేనేజ్‌మెంట్‌పైనే దృష్టి పెట్టి ప్రజల భద్రతను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. తెలంగాణలో క్షీణిస్తున్న శాంతిభద్రతల పరిస్థితిపై కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సైబర్ నేరాలు, మిస్సింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, మహిళలు మరియు చిన్నారులకు మెరుగైన భద్రత కల్పించాలని, ఇంటెలిజెన్స్ వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. ప్రజల భద్రతను రాజకీయ ప్రచారం కోసం బలి చేయొద్దని హరీశ్ రావు హెచ్చరించారు.

# కేంద్ర నిధులతోనే గ్రామ పంచాయతీల నిర్వహణ

**మొదటిపేజీ తరువాయి**

అన్నారు.
ఈ నెల 10న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న బీజేపీ బహిరంగ సభ ఏర్పాట్లను శుక్రవారం ఈటల రాజేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర మద్దతు లేకుండా రాష్ట్రానికి నిధులు రావడం సాధ్యం కాదన్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీల నిర్వహణలో కేంద్ర నిధులే కీలకంగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఈటల వ్యాఖ్యానించారు. కేసీఆర్ పాలనకు ప్రజలు ఇప్పటికే తీర్పు ఇచ్చారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా అసంతృప్తి పెరుగుతోందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు కూడా గట్టి సమాధానం ఇస్తారని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీ తొలి లక్ష్యం జీహెచ్ఎంసీ ఎన్నికలేనని, ఆ తర్వాత జడ్పీటీసీ, ఎంపీటీసీ, అసెంబ్లీ ఎన్నికలపై దృష్టి సారిస్తామని ఈటల రాజేందర్ తెలిపారు.





## ఆటోలను ఈవీలుగా మార్చేందుకు
# ప్రభుత్వ సహాయం

- కాలుష్య రహిత హైదరాబాద్ లక్ష్యంగా సీఎం రేవంత్
- హజ్ యాత్రికుల బస్సులకు జెండా ఊపిన ముఖ్యమంత్రి
- హాజీల అదనపు భారాన్ని భరిస్తామని ప్రకటన

**హైదరాబాద్, మే 8**

హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు నగరంలోని ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. కోర్ అర్బన్ రీజియన్‌లో ఉన్న ఆటోలకు ప్రభుత్వ నిధులతో రెట్రో ఫిట్టింగ్ చేయించేందుకు ఐదు కంపెనీలతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. హైదరాబాద్ హజ్ హౌజ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి హజ్ యాత్రకు బయలుదేరుతున్న యాత్రికుల బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మహ్మద్ అజహరుద్దీన్, ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.
సభలో మాట్లాడిన ముఖ్యమంత్రి హజ్ యాత్రకు వెళ్తున్న యాత్రికులకు తెలంగాణ ప్రభుత్వం తరఫున శుభాకాంక్షలు తెలిపారు. మైనారిటీల సంక్షేమం, అభివృద్ధి విషయంలో ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. హిందూ, ముస్లింలు తనకు రెండు కళ్ల లాంటి వారని, ఇద్దరూ అన్నదమ్ముల్లా కలిసి తెలంగాణ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మైనారిటీల నిష్పత్తికి అనుగుణంగా సంక్షేమ పథకాల లబ్ధి అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సీఎం తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో మైనారిటీల భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యువత ఉపాధిపై కూడా ముఖ్యమంత్రి మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావంతో వైట్ కాలర్ ఉద్యోగాలకు ముప్పు పెరుగుతోందని, అందువల్ల నైపుణ్యాభివృద్ధిపై యువత దృష్టి పెట్టాలని సూచించారు. స్కిల్స్ యూనివర్సిటీలు, పాలిటెక్నిక్, శిక్షణా కేంద్రాల్లో చదివి ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. అమెరికా, మిడిల్ ఈస్ట్ దేశాలతో పాటు జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా వంటి దేశాల్లో కూడా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. యువత ప్రపంచ స్థాయి నైపుణ్యాలు సంపాదించాలని సూచించారు. ఇరాన్ యుద్ధ పరిస్థితుల కారణంగా పెట్రోల్ ధరలు పెరిగాయని చూపిస్తూ హజ్ యాత్రికులపై ఒక్కొక్కరికి రూ.10 వేల అదనపు భారం మోపారని సీఎం పేర్కొన్నారు. ఈ భారాన్ని భరించలేని పరిస్థితి ఉన్నందున 7 వేల మంది హాజీలపై పడిన అదనపు వ్యయాన్ని ప్రభుత్వం భరిస్తుందని ప్రకటించారు. గత ఏడాది హజ్ యాత్ర సందర్భంగా జరిగిన బస్సు ప్రమాదంలో 44 మంది మరణించిన విషయాన్ని గుర్తుచేసిన ముఖ్యమంత్రి, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున పరిహారం అందించిందని తెలిపారు. మైనారిటీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

# మహిళా సంఘాలకు గుడ్‌న్యూస్

**హైదరాబాద్, మే 7 :**

మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు అర్హత గల మహిళా సంఘాలకు అందిస్తున్న రూ.5 లక్షల వడ్డీ లేని రుణాల పరిమితిని ఇకపై రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క (Minister Seethakka) ప్రకటించారు. మహిళా సంఘాలు తీసుకునే రూ.10 లక్షల వరకు బ్యాంకు రుణాలకు సంబంధించిన వడ్డీ మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన మహిళా స్వయం సహాయక బృందాల వార్షిక రుణ ప్రణాళిక 202627 ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ దాన కిషోర్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, స్త్రీనిధి డిప్యూటీ ఎండీ శ్రీనాథ్, ఎస్ఎల్బీసీ కన్వీనర్ సతీష్ కుమార్, ప్రముఖ బ్యాంకర్లు, అధికారులు, జిల్లా సమాఖ్య ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఈ ఏడాది మహిళా సంఘాలకు రూ. 26,621.47 కోట్ల రుణ సదుపాయం కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. గత 2025-26లో మహిళా సంఘాలకు రూ.25,228.89 కోట్ల బ్యాంకు రుణాలు అందించినట్లు తెలిపారు. గత రెండు సంవత్సరాల్లో రూ. 40 వేల కోట్ల బ్యాంకు లింకేజ్ రుణాలు ఇవ్వాలని టార్గెట్ పెట్టుకుంటే, 60 వేల కోట్ల రూపాయల రుణాలు ఇచ్చినట్లు వెల్లడించారు. ఇదంతా మహిళా సంఘాలు బ్యాంకర్ల సహకారంతోనే సాధ్యమైంది అని వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ పంట కొనుగోలు కేంద్రాల్లో 40 శాతం కేంద్రాలను మహిళా సంఘాలకు అప్పగించాం" అని తెలిపారు. గతంలో మహిళలకు చిన్న మొత్తాల రుణాలు కూడా లభించని పరిస్థితి ఉండేదని, ఇప్పుడు లక్షల రూపాయల రుణాలు బ్యాంకులు నమ్మకంతో ఇస్తున్నాయని చెప్పారు. మహిళా సంఘాలు రుణాల రీపేమెంట్‌లో అద్భుతమైన క్రమశిక్షణ చూపిస్తున్నాయని, ఎస్‌హెచ్‌జీల ఎన్పీఏ కేవలం 1.40 శాతంగా ఉండటం మహిళల ఆర్థిక బాధ్యతకు నిదర్శనమని అన్నారు.

# ఆగస్టు నాటికి మూసీ పునరుజ్జీవ పనులు

**హైదరాబాద్, మే 8 :**

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు (Musi River Rejuvenation) పనులను ఆగస్టు నాటికి ప్రారంభించాలని అధికారులను మంత్రివర్గ ఉపసంఘం ఆదేశించింది. ప్రజల ఆస్తులపై ప్రభావం లేని ఐదు కిలోమీటర్ల మేర పనులు చేపట్టాలని తెలిపింది. నిర్మాణాలపై ఎక్కువ ప్రభావం లేకుండా అలైన్‌మెంట్‌లు మార్చాలని సూచించింది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక లక్ష్యంతో చేపట్టిన మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు కేవలం ఒక నది ప్రక్షాళన మాత్రమే కాదు, అది ఒక సామాజిక బాధ్యత అని కేబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. అభివృద్ధి అంటే మనుషులను దూరం చేయడం కాదు, వారిని భాగస్వాములను చేయడమేనని చాటి చెబుతూ అధికారులకు కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ ప్రాజెక్టును అత్యంత పారదర్శకంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజల్లో ఉన్న ప్రతి అనుమానాన్ని నివృత్తి చేసి, వారిలో పూర్తి స్థాయి విశ్వసనీయత కల్పించేలా అధికారుల కార్యాచరణ ఉండాలని సబ్ కమిటీ ఆదేశించింది. ప్రజల ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని కమిటీ నొక్కి చెప్పింది. ప్రజల ఆస్తులకు, నివాసాలకు కనీస నష్టం కూడా కలగకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచిస్తోంది. ప్రాజెక్టు రూపకల్పనలో భాగంగా ఇప్పటికే ఉన్న నిర్మాణాలపై అతి తక్కువ ప్రభావం పడేలా అలైన్‌మెంట్‌ను మార్చుకోవాలని కమిటీ సూచించింది. అత్యంత జాగ్రత్తగా ప్రణాళికలు రూపొందించి, ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించింది.
"మూసీ పునరుజ్జీవనం ద్వారా నగరం రూపురేఖలు మారడమే కాకుండా, పరివాహక ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయని, ప్రజల భాగస్వామ్యంతోనే ఈ అద్భుత ప్రాజెక్టు సాకారం అవుతుందని, "అభివృద్ధి - ప్రజాహితం" రెండూ సమాంతరంగా సాగాలని కేబినెట్ సబ్ కమిటి అధికారులకు దిశ నిర్దేశం చేసింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన మూసీ పునర్జీవం ప్రాజెక్టు క్యాబినెట్ సబ్ కమిటి సమావేశం శుక్రవారం ప్రజాభవన్ లో జరిగింది. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, పొన్నం ప్రభాకర్ గారలతో కలిసి డిప్యూటి సీఎం ఉన్నత స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు పురోగతి, నిధుల సమీకరణ, నిర్మాణ పనులకు సంబంధించిన క్యాలెండర్ పై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.
5 దశల్లో 55 కిలోమీటర్ల వరకు అభివృద్ధి పనులు మూసి పునర్జీవన ప్రాజెక్టు 5 దశల్లో 55 కిలోమీటర్ల వరకు అభివృద్ధి పనులు చేపట్టనున్నామని, దీనిలో భాగంగా ఫేజ్ 1 సుమారు ₹7,055 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు ఆసియా అభివృద్ధి బ్యాంక్ నుంచి నిధులు సమకూర్చుకునేందుకు సాంకేతిక, ఆర్థిక చర్చలు విజయవంతంగా ముగిశాయని అధికారులు మంత్రులకు వెల్లడించారు. ఫేజ్ 1లో భాగంగా హిమాయత్ సాగర్ నుంచి బాపుఘాట్, ఉస్మాన్ సాగర్ నుంచి బాపుఘాట్ 21 కిలోమీటర్ల మేరకు నిర్మాణ పనులను ఏటువంటి ప్రభావం లేని తొలి ఐదు కిలోమీటర్ల పనులను వెంటనే ప్రారంభించాలని మంత్రులు అదేశించారు.
మూసీ పునర్జీవనంలో భాగంగా నదిలో ఉన్న చెత్త చెదరాన్ని తొలగించి, పరిశుభ్ర పర్చడం, హైడ్రాలజీ ప్రకారంగా రివర్ బెడ్ ప్రొఫైలింగ్ చేయడం, వరద నియంత్రణ కోసం రిటైనింగ్ వాల్స్ నిర్మాణం, నదికి రెండు వైపులా రోడ్ల నిర్మాణం, నదికి రెండు వైపులా ప్రధాన మురుగు నీటి కాలువల నిర్మాణం, నాలాలు ఏర్పాటు, నీటి నిల్వ కోసం బ్యారేజీల నిర్మాణం, రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేయడం జరుగుతుందని రూపొందించిన డిపిఆర్ ను మూసి ప్రాజెక్టు మేనేజింగ్ డైరెక్టర్ ఈ.వి నర్సింహ్మారెడ్డి మంత్రులకు వివరించారు.
ఈస్ట్‌టువెస్ట్ కారిడార్ లో భాగంగా నార్సింగి - గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేయనున్నామని, ఉప్పల్ భగాయత్ నుంచి గౌరెల్లి వరకు విస్తరణపై డిపిఆర్ తయారీ దశలో ఉందని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మీర్ ఆలం ట్యాంకు పురోగతి పనులను వివరించారు. గాంధి సరోవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు కావాల్సిన భూమిని రక్షణ శాఖ నుంచి బదలాయింపు చేసుకునే అంశంపై చర్చించారు. పర్యావరణానికి సంబంధించిన అన్ని అనుమతులను తీసుకొని ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లాలని డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క అధికారులను అదేశించారు, మూసి ప్రాజెక్టు పునర్జీవనం వల్ల కలిగే ఉపయోగాల గురించి నగరంలో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. బస్టాండ్లు, మెయిన్ రోడ్లు హోర్డింగ్స్ ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించారు. సినిమా థియేటర్ లో కూడ వీడియోలను ప్రదర్శించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్థిక, అనుమతులు, విభాగాల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ఎక్కడా జాప్యం లేకుండా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. రాజధాని అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు అమలుకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన గడువును నిర్ణయించిందని వెల్లడించారు. అన్ని రకాల అనుమతులు, విధానపరమైన ప్రక్రియలు పూర్తి చేసుకుని 2026 ఆగస్టు నాటికి పనులు ప్రారంభించాడానికి లక్ష్యంగా పెట్టుకొవాలన్నారు. ఈ బృహత్తర ప్రాజెక్టును డిసెంబర్ 2027 నాటికి పూర్తి చేయాలన్నారు.. దీనికి సంబంధించిన పూర్తి క్యాలెండర్ ను సమర్పించాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. టైంలైన్ నిర్దేశించుకొని స్పష్టమైన పురోగతి కనిపించే విధంగా పనుల నిర్మాణం జరుగాలని మంత్రి శ్రీధర్ బాబు అధికారులకు సూచించారు. ప్రజాభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ఎవరికి ఏలాంటి ఇబ్బంది కలుగకుండ నిర్మాణ పనులను సత్వరమే ప్రారంభించి ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో సాంకేతికపరమైన అంశాలలో ఐఐటి, జెఎన్ టియూ సంస్థల నుంచి తగిన సహకారం తీసుకోవాలని సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రానున్న వర్షకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్మాణ పనులకు ఎటువంటి ఆటంకాలు కలుగకుండ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పని సరిగా పాటించే విధంగా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. రబ్బర్ డ్యాం నమూనాల పరిశీలించిన మంత్రులు
మూసీ పునర్జీవం ప్రాజెక్టులో టూరిజం అభివృద్ధిలో భాగాంగ నదిలో పలు చోట్ల చెక్ డ్యాంల తరహాలో రబ్బర్ డ్యాంలను ఏర్పాటు చేయనున్నారు. వీటి నిర్మాణాల వల్ల నీటి నిల్వను పెంచడం, జలక్రీడలు, మరియు బోటింగ్ సదుపాయాలకు ఉపయోగపడుతుంది. ఒబెర్ మేయర్ స్పిల్ వే గేట్ టెక్నాలజీ రూపొందించిన రబ్బర్ డ్యాం నమూనాను ప్రజా భవన్ లో మంత్రులు ఆసక్తిగా తిలకించారు. నాసిక్, ముంబాయి నగరాల్లో ఈ టెక్నాలజీ సంస్థ నిర్మాణం చేసిన రబ్బర్ డ్యాంలను పరిశీలించి తగిన అధ్యయనం చేసిన తరువాత నివేధిక ఇవ్వాలని అధికారులను మంత్రులు అదేశించారు. ఈ సమావేశంలో మెట్రో పాలిటన్ ఏరియా అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, డిప్యూటి సీఎం సెక్రటరీ కృష్ణా భాస్కర్, వాటర్ బోర్డు ఎం.డి అశోక్ రెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలు అత్యంత ప్రమాదకరమైన ముప్పుగా మారాయి

- సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్

**అక్షర గళం, సైబరాబాద్ :**

ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు అత్యంత ప్రమాదకరమైన ముప్పుగా మారాయని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ అన్నారు. సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని వివిధ బ్యాంకుల ప్రతినిధులతో శుక్రవారం సైబరాబాద్ సీపీ కార్యాలయ ఆడిటోరియంలో ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. సైబర్ నేరాలకు సంబంధించిన కేసుల్లో బ్యాంకులు, పోలీసుల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం ద్వారా దర్యాప్తును వేగవంతం చేయడం, ముఖ్యంగా మ్యూల్ అకౌంట్ల నియంత్రణ, ఖాతాల ఫ్రీజ్, డిఫ్రీజ్ ప్రక్రియలు, బాధితులకు నగదు వాపసు ఇవ్వడం, డిజిటల్ మోసాల విచారణపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ ఆన్‌లైన్ స్కామ్‌లు, నకిలీ పెట్టుబడి పథకాలు, ఫ్రీలాంచ్ ఆఫర్లు, కాల్ సెంటర్ మోసాలు, క్రిప్టో కరెన్సీ స్కామ్‌లు తదితరాల ద్వారా ప్రజలు భారీ మొత్తంలో డబ్బును కోల్పోతున్నారని అన్నారు. చాలామంది తమ జీవితకాల పొదుపులను కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సైబరాబాద్ పరిధిలో 2025 సంవత్సరంలో సైబర్ మోసాల కారణంగా ప్రజలు రూ.438 కోట్లను కోల్పోగా, 2026 సంవత్సరంలో ఇప్పటివరకు రూ.104 కోట్లను కోల్పోయినట్లు వెల్లడించారు. సోషల్ మీడియా ద్వారా అవగాహన పెరుగుతున్నప్పటికీ, మరింత అప్రమత్తత, పటిష్టమైన నివారణ చర్యలు అవసరమని ఆయన స్పష్టం చేశారు. బ్యాంకింగ్ డేటా భద్రత, మ్యూల్ అకౌంట్ల నియంత్రణ, దర్యాప్తులకు బ్యాంకుల నుంచి సకాలంలో సహకారం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించడానికి ప్రతి బ్యాంకులో ప్రత్యేకమైన మరియు కేంద్రీకృత 'సైబర్ సెల్స్' ఏర్పాటు చేయాలని సీపీ కోరారు. ప్రజలు కూడా పెట్టుబడులు పెట్టే ముందు వాస్తవాలను సరిచూసుకోవాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, నేరగాళ్లకు సహకరించవద్దని విజ్ఞప్తి చేశారు. దర్యాప్తులో ఎదురవుతున్న సవాళ్ల గురించి సైబర్ క్రైమ్ డీసీపీ టి. సాయి మనోహర్ మాట్లాడుతూ బ్యాంకుల నుండి ఖాతా వివరాలు, కేవైసీ పత్రాలు, ఫ్రీజ్ కన్ఫర్మేషన్లు అందడంలో జరుగుతున్న ఆలస్యం



వల్ల నిందితులను పట్టుకోవడం కష్టమవుతోందని తెలిపారు. మ్యూల్ అకౌంట్లను నియంత్రించడం ద్వారా నేరాలను అదుపు చేయవచ్చని, ఒకసారి ఖాతాను ఫ్రీజ్ చేసిన తర్వాత ఎలాంటి డెబిట్ లావాదేవీలు జరగకుండా చూడాలని బ్యాంకర్లకు సూచించారు. ఖాతాల ఫ్రీజ్, డిఫ్రీజ్ ప్రక్రియల్లో జరుగుతున్న ఆలస్యంపై కూడా చర్చించారు. సీఎస్‌బీ ఎస్పీ సాయి శ్రీ ఎన్‌సీఆర్‌బీ డాటాను విశ్లేషిస్తూ, ప్రతి బ్యాంకులో అప్‌డేట్ చేయబడిన నోడల్ ఆఫీసర్ వివరాలతో కూడిన 'సైబర్ క్రైమ్ రెస్పాన్స్ డెస్క్' ఏర్పాటు చేయాలని సూచించారు. దీనివల్ల కమ్యూనికేషన్ వేగవంతం కావడమే కాకుండా, కష్టమర్ల సొమ్మును కాపాడవచ్చని తెలిపారు. బ్యాంక్ సిబ్బందికి సైబర్ నేరాల ప్రక్రియలపై శిక్షణ ఇవ్వాలన్నారు. కార్పొరేట్ ఖాతాలకు సంబంధించిన రిలేషన్ షిప్ మేనేజర్ల వివరాలను పంచుకోవాలని అధికారులకు సూచించారు.
ఈ సమావేశంలో కుత్బుల్లాపూర్ డీసీపీ కోటి రెడ్డి, క్రైమ్స్ డీసీపీ ఏ. ముత్యం రెడ్డి, సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్, సీఎస్‌బీ ఎస్పీ సాయి శ్రీ, హెచ్‌డీఎఫ్‌సీ, బ్యాంక్ ఆఫ్ బరోడా, యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, కోటక్ మహీంద్రా బ్యాంక్ వంటి వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.



# ఆర్టిసన్ల డిమాండ్లపై ప్రభుత్వ హామీ వాయిదా

**మొదటిపేజీ తరువాయి**

సమ్మె చేపట్టారు. అప్పట్లో ప్రభుత్వ పెద్దల హామీ మేరకు షరతులు లేకుండానే సమ్మె విరమించారు. ఐతే ఆ తర్వాత పలుమార్లు యాజమాన్యం తో భేటీ ఐనా చర్చల వరకు పోలేదు. ఐతే శుక్రవారం ఉప ముఖ్యమంత్రి భట్టి ఆదేశాలతో ఇంధనశాఖ కార్యదర్శి, టీజీయెస్పిడిసీఎల్ సీఎండీ, ట్రాన్స్కో సీఎండీ, టీజీఆర్పిడిసిఎల్ సీఎండీ లతో టీజాక్ చర్చలు జరిపింది. ఈ సందర్భంగా తమ ప్రధాన డిమాండ్ల ను పరిష్కరించాలని టీజాక్ నేతలు కోరారు. ఇందులో గ్రేడ్ కన్వర్షన్ కు కమిటీ వేస్తామని హామీ ఇచ్చారట.ఇక ప్రధాన డిమాండ్ ఐన ఏపిఎస్ఈబి రూల్స్ అమలుపై మరికొంత సమయం కావాలని యాజమాన్యం చెప్పిందట దింతో చర్చ జరగకుండానే వాయిదాపడ్డట్టైంది.

**ఆందోళనలో ఆర్టిసన్లు !**

ప్రభుత్వ హామీ ఇచ్చిన హామీ ఈ రోజు అమలుకు నోచుకుంటుందని 20 వేల మంది కార్మికులు గంపెడాశతో ఎదురు చూసారు. కానీ చర్చలు అసంపూర్తిగానే ముగియడంతో ఆర్టీసన్లు అసహనానికి గురయ్యారు. డిమాండ్లు అన్ని తెల్సు ఐనా ఇంకా కాలయాపన చేస్తున్నారంటే సమస్య పరిష్కరించే దిశలో యాజమాన్యం లేదని స్పష్టం అవుతుందని ఓ యూనియన్ నేత పేర్కొన్నారు. అప్పుడు మంత్రి మాటను నమ్మి సమ్మె వాయిదా వేస్తే ఇప్పుడు ఇలా డిమాండ్లను నెరవేర్చకుండా తిప్పుకోవడం బాగా లేదని ఆ నేత పేర్కొన్నారు.

**పవర్ జాక్ మాట వినుంటే**

ఆర్టిసియన్ల సమ్మె జరుగుతున్నపుడు ప్రభుత్వ పెద్దలతో రెగ్యులర్ ఉద్యోగులకు సంబందించిన పవర్ జాక్ చర్చలు జరిపింది. ఆ సందర్భంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క షరతులు లేకుండా సమ్మె విరమిస్తే సాధ్యమైన సమస్యలు వెంటనే పరిష్కారం చేస్తామని చెప్పారట. అదే విషయాన్ని టీజాక్ నేతల ముందు ఉంచగా పవర్ జాక్ ప్రతిపాదనను వాళ్ళు తిరస్కరించారు. ఆ తరవాత షరతులు లేకుండానే ఒప్పుకున్నారు. మొదట్లో పవర్ జాక్ చెప్పినపుడు సమ్మె విరమించి ఉంటె వాళ్లపై వత్తిడి ఉండేది విద్యుత్ శాఖలో అన్ని సంఘాల కలియక పవర్ జాక్ కాబట్టి ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి ఇంత తాత్సారం చేసేవారు కాదని కొందరు వాదిస్తున్నారు. ఆ తదనంతర పరిమాణాలతో ఇప్పడు టీజాక్ పవర్ జాక్ నేతల మధ్య కొంత దూరం పెరగడం కూడా యాజమాన్యం కు కలిసొచ్చింది.

**ప్రధానసంఘాలపై విమర్శలు**
**ఆర్టీసన్లకు శాపంగా మారాయ?**

విద్యుత్ శాఖలో సమ్మె మూలంగా ఒకవైపు ఆర్టీసియన్లు మరోవైపు రెగ్యులర్ ఉద్యోగులు అన్న విదంగా మారింది పరిస్థితి. సమ్మె అనంతరం కొందరు టీజాక్ నేతలు ఏళ్లుగా ఉన్న ప్రధాన సంఘాలపై విమర్శలు చేయడం కొందరు ఏకంగా సమ్మె చేయమని చెప్పి ప్రధాన సంఘాలు తప్పించుకున్నాయని ప్రచారం చేయడం సైతం పవర్ జాక్ మౌనానికి కారణమైందని తెల్సుతోంది. విద్యుత్ శాఖలో సమస్యలపై నిత్యం పోరాడే సంఘాలపై ఇష్టారీతిగా మాట్లాడటం వాళ్ళ ఆర్టిసన్లు సమస్యల పరిష్కారం ముందుకు పోవడం లేదన్న విమర్శ ఉంది.

**ఆర్టిసన్లు అధైర్యపడొద్దు :**
**టీజాక్ కన్వీనర్ సతీష్ రెడ్డి**

తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్లు ఎవరు అధైర్య పడొద్దని టీజాక్ కన్వీనర్ సతీష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం యాజమాన్యం తో చర్చల అనంతరం అయన మీడియాతో మాట్లాడారు. యాజమాన్యానికి మా ప్రధాన డిమాండ్లను వివరించాం. అందుకు వారు కొంత సమయం అడిగారు. 3 రోజుల్లో మల్లి కలుస్తాం అంతా సానుకూలంగానే ఉంటుందని భావిస్తున్నట్టు చెప్పారు. ప్రధాన డిమాండ్లు నెరవేరేవరకు పోరాటం తప్పదని అయన అన్నారు.

## స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం



**తూప్రాన్ మే 8 సిరి న్యూస్**

తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో శుక్రవారం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా వైస్ చైర్మన్ సమతా కాశిరెడ్డి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు కార్యక్రమంలో భాగంగా వార్డులో చెత్త చెదారం తో పాటు కాలనీలోని మట్టి కుప్పలను ట్రాక్టర్ ద్వారా శుభపరిచారు అదే విధంగా మున్సిపల్ కార్మికులకు ఎండ దెబ్బ తగలకుండా ఉండడానికి క్యాన్సర్ పెట్టుకోవాలి సూచించి క్యాప్లు అందజేశారు ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించి ఇంటి అవసరాలకు వాడిన తడి పొడి చెత్తను మున్సిపల్ నుండి వచ్చిన చెత్త సేకరణ ఆటోలో వెయ్యాలని ఆరోగ్యమైన నగరంగా ఉండాలంటే ప్రజలు సహకరించాలని కోరారు

## కిష్టాపూర్ సహకార సంఘం చైర్మన్ గా బాధ్యతలు స్వీకరిస్తున్న మల్లేశం గౌడ్



**కొల్చారం మే 8( సిరి న్యూస్)**

కొల్చారం మండల పరిధిలోని కిస్టాపూర్ సహకార సంఘం చైర్మన్ పదవి ప్రభుత్వ సూచనల మేరకు మల్లేశం గౌడ్ కి మరోసారి లభించింది శుక్రవారం నాడు సహకార సంఘంలో ఆయన బాధ్యతలను స్వీకరించారు మాట్లాడుతూ సహకార సంఘం బలోపేతానికి కృషి చేస్తామని అన్నారుఈ కార్యక్రమంలో సీఈఓ నవీన్ వైస్ చైర్మన్ చాకలి ప్రభాకర్ డైరెక్టర్లు నారాయణ. షేర్ పల్లి షేకులు చాతరి ప్రమీల సార డాటా గౌడ్ వెంబడి శేఖర్. అత్యం శ్రీనివాస్ చిట్యాల చిన్న పోచయ్య. అందుల పల్లి శ్రీరాములు. అటెండర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు

## భారీ అండాశయ కణితిపై విజయవంతమైన శస్త్రచికిత్స..

### యువతి ప్రాణాలను కాపాడిన మెడికవర్ బృందం

### 20 సెం.మీ కణితిని తొలగించిన వైద్యులు




**రామచంద్రపురం, మే 8, (సిరి న్యూస్):**

సంగారెడ్డి జిల్లా దౌల్తాబాద్ మండలం బోడపట్ల గ్రామానికి చెందిన 35 ఏళ్ల సంధ్యకు విజయవంతంగా నిర్వహించిన అరుదైన శస్త్రచికిత్స వివరాలను చందానగర్‌లోని మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు.సంధ్య తీవ్ర కడుపునొప్పి, పొట్ట అసాధారణంగా పెరగడం వంటి సమస్యలతో ఆసుపత్రిని ఆశ్రయించగా పరీక్షల్లో ఆమె కుడి అండాశయంలో సుమారు 20 సెం.మీ పరిమాణంలో భారీ ఓవేరియన్ సిస్ట్ ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు.డాక్టర్ భవ్య ఆధ్వర్యంలో, డాక్టర్ రఘు రామిరెడ్డి సహకారంతో ప్రత్యేక బృందం విజయవంతంగా ఓపెన్ సర్జరీ నిర్వహించి కణితిని పూర్తిగా తొలగించినట్లు పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన బయాప్సీలో అది బెనైన్ మ్యూసినస్ సిస్టాడెనోమా అని నిర్ధారణ అయిందని, క్యాన్సర్ లక్షణాలు లేవని వెల్లడించారు.ప్రస్తుతం సంధ్య ఆరోగ్యంగా కోలుకుంటోందని, సరైన సమయంలో ఆసుపత్రికి రావడం వల్లే ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపారు. మహిళలు కడుపునొప్పి, పొట్ట ఉబ్బరం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

## మెదక్ ఐటిఐలో జాబ్ మేళా

- ప్రభుత్వ ఐటీఐలో 11న 'ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ షిప్ మేళా'

**మెదక్ మే,08(సిరిన్యూస్)**

మెదక్ పట్టణంలోని ప్రభుత్వ ఐ.టి.ఐ కళాశాల ప్రాంగణంలో ఈ నెల11న "ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా" నిర్వహించబడుతుందని కళాశాల ప్రిన్సిపాల్ మరియు కన్వీనర్ గుమ్మకొండ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో మెదక్ జిల్లాతో పాటు హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుండి పలు ప్రముఖ పరిశ్రమలు, కంపెనీలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేసుకోనున్నాయన్నారు. కావున మెదక్ పట్టణంలోని మరియు జిల్లావ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు, ఐటీఐ ఉత్తీర్ణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మత్స్య కార్మికులకు ప్రభుత్వం పెద్దపీట





- జిల్లా అదనపు కలెక్టర్ మెంచు నగేష్

**మెదక్ మే,08(సిరిన్యూస్)**

మత్స్య కార్మికులకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ మెంచు నగేష్ అన్నారు.శుక్రవారం కలెక్టరేట్ లోని మీటింగ్ హాల్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లాస్థాయి మత్స్యకారులకు అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా మత్స్యశాఖ ఇన్చార్జి గడప దేవేందర్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..మత్స్య సంపదను పరిరక్షించడం ద్వారా మత్స్యకారుల ఆర్థిక స్థితి మరింత బలోపేతం అవుతుందని పేర్కొ న్నారు. ప్రభుత్వం మత్స్య కార్మికుల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, వాటిని ప్రతి మత్స్యకారుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రస్తుతం మార్కెట్‌లో చేపలకు మంచి డిమాండ్ ఉందని తెలిపారు. మత్స్య సహకార సంఘం పర్సన్ ఇంచార్జి గడప దేవేందర్ మాట్లాడుతూ..ప్రతి మత్స్యకారుడు ప్రకృతి సంపదను కాపాడే బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు.సరైన పద్ధతుల్లో చేపల పెంపకం చేపడితే మత్స్యకారులకు అధిక ఆదాయం లభిస్తుందని తెలిపారు. జిల్లాలో 200 మత్స్య సొసైటీలో 15,888 మత్స్య కార్మిక సభ్యులు ఉన్నారని,అందులో 25 మంది మహిళా మత్స్య కార్మికులు ఉన్నారన్నారు.ఉమ్మడి మెదక్ జిల్లా మత్స్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లేశం మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, రుణ సౌకర్యాలు, బీమా పథకాలు, మత్స్యకార భరోసా పథకాల గురించి వివరించి ప్రతి లబ్ధిదారుడు నమోదు చేసుకోవాలని కోరారు. మత్స్యకారులకు చేపల పెంపకంలో పాటించాల్సిన శాస్త్రీయ పద్ధతులు, చెరువుల నిర్వహణ, చేపల విత్తనాల ఎంపిక, ఆహార నిర్వహణ, నీటి నాణ్యత పరిరక్షణ, వ్యాధుల నివారణ వంటి అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు.అలాగే ఆధునిక సాంకేతికతను వినియోగించి చేపల ఉత్పత్తిని పెంచుకోవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో అధికారులు, మత్స్యకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య పనులకు శాశ్వత పరిష్కారం

- ఎస్సీ కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం
- అండర్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన సర్పంచ్




**గుమ్మడిదల(కానుకుంట), మే 8 (సిరి న్యూస్):**

గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రజా పాలనలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని కానుకుంట గ్రామ సర్పంచ్ ఇప్ప పెంటారెడ్డి తెలిపారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల పరిధిలోని కానుకుంట గ్రామంలోని 10, 11 వార్డుల్లో అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులకు సర్పంచ్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో పారిశుద్ధ్య సమస్యలు లేకుండా శాశ్వత పరిష్కారం దిశగా పనులు చేపడుతున్నామని తెలిపారు. వర్షపు నీరు, మురుగునీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను దశలవారీగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడంలో గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ ముందుంటుందని, ముఖ్యంగా ఎస్సీ కాలనీల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని సర్పంచ్ తెలిపారు. గ్రామ ప్రజలు సహకరిస్తే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దేవేందర్ గౌడ్, ఉప సర్పంచ్ పాషా, వార్డు సభ్యులు ప్రేమ్ కుమార్, నవీన్, పెంటేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు అంజాత్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇప్ప నర్సింహా రెడ్డి, గడ్డం యాదగిరి, సుధాకర్, ఆశీర్వాదం, వెంకటేష్, గ్రామ పెద్దలు బాల్ రెడ్డి, మురళి, బాలారం, పోచయ్య, నతనైలు, కాంతి, ప్రవీణ్, చంద్రయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- వార్డు కౌన్సిలర్ తుపాకుల రాధికరాజు ఆధ్వర్యంలో పనులు
- మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్

**గుమ్మడిదల( అన్నారం), మే 8 (సిరి న్యూస్):**

వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపాలిటీ ప్రత్యేక చర్యలు చేపడుతోందని మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం 6వ వార్డులో నూతన బోరుబావి ఏర్పాటు పనులను కౌన్సిలర్ తుపాకుల రాధికరాజు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి వార్డులో నీటి సరఫరా పరిస్థితిని పరిశీలిస్తూ అవసరమైన చోట్ల బోర్లు, పైప్‌లైన్ మరమ్మత్తులు, నీటి సరఫరా సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని చెప్పారు. ప్రజలకు ప్రాథమిక అవసరమైన మంచినీటిని అందించడం మున్సిపాలిటీ బాధ్యతగా భావిస్తున్నామని, ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. స్థానిక ప్రజల సూచనలు, అవసరాలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి పనులను కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు మురళి, సంజీవరెడ్డి, కిషన్, నాయకులు తుపాకుల రాజు, స్థానిక యువకులు, గ్రామ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత

- పశుసంరక్షణతో అదనపు ఆదాయం
- కలెక్టర్ ప్రతీక్ జైన్
- సరాఫ్‌పల్లిలో అవగాహన శిబిరం నిర్వహణ
- సబ్సిడీపై పశుగ్రాస విత్తనాల పంపిణీ




**సంగారెడ్డి, (సిరి న్యూస్):**

పాడి పరిశ్రమ రైతులకు స్థిరమైన అదనపు ఆదాయ వనరుగా మారేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చౌటుకూరు మండలం సరాఫ్‌పల్లి గ్రామంలో శుక్రవారం పశుసంవర్ధక శాఖ, పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమగ్ర పశు సేవలు, పశు చికిత్స మరియు అవగాహన శిబిరంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామంలో పశుసంపద అధికంగా ఉండటం ఆనందంగా ఉందన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచడంలో పశుసంపద కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. పశువుల ఆరోగ్య పరిరక్షణ, డివార్మింగ్, టీకాలు, పశుగ్రాస నిర్వహణ, సంతానోత్పత్తి సేవలు, పాల ఉత్పత్తి పెంపు వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఇటువంటి శిబిరాలు ఉపయోగకరమని తెలిపారు. గ్రామస్థాయిలో రైతులకు మరింత చేరువై సేవలు అందించాలని పశుసంవర్ధక శాఖ అధికారులకు సూచించారు. పశువుల చికిత్సలు, శస్త్రచికిత్సల కోసం అవసరమైన టేబుళ్లు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరగా, తగిన చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారి వసంత కుమారిని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌తో పాటు రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజలు తమ సమస్యలను అక్కడ తెలియజేసి పరిష్కారం పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేశారు. శిబిరంలో పశువులకు డివార్మింగ్ మందులు వేయడంతో పాటు పశు సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వసంత కుమారి, జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్, గ్రామ సర్పంచ్, తహసీల్దార్, రైతులు, పాడి రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో రైస్ మిల్లర్లు సహకరించాలి

- మిల్లులకు చేరిన ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేయాలి
- మిల్లర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం
- కలెక్టర్ ప్రతీక్ జైన్




**సంగారెడ్డి, (సిరి న్యూస్):**

జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సాఫీగా, వేగవంతంగా నిర్వహించేందుకు రైస్ మిల్లర్లు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రస్తుతం జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అధికారులు, మిల్లర్లు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు చేరుతున్న ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేసుకోవాలని, ఆలస్యం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మిల్లర్లు అవసరానికి అనుగుణంగా ఎక్కువ సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని, ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా చూడాలని తెలిపారు. రైతులు ధాన్యం విక్రయానికి వచ్చినప్పుడు నిరీక్షణ లేకుండా త్వరితగతిన ప్రక్రియ పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, మిల్లర్లు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్లు తమకు ఎదురవుతున్న పలు సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా, వాటిని పరిశీలించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ టి.ఎల్. సంగీత, జిల్లా పౌర సరఫరాల అధికారి, సివిల్ సప్లై డీఎం, డీసీఓ, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులపై ఓ వ్యక్తి చేసిన ఆరోపణలు అవాస్తవం

- ఐదు కేసులు నమోదు తో బైండోవర్ చేసాం
- కొండాపూర్ పీఎస్ లో డిఎస్పి ప్రెస్ మీట్

**(సిరి న్యూస్):**

పోలీసులు రెవెన్యూ అధికారులపై ఓ వ్యక్తి చేసిన ఆరోపణలు అవాస్తవమని సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య వెల్లడించారు. శుక్రవారం కొండాపూర్ పోలీస్ స్టేషన్ సిఐ,ఎస్ఐ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి డిఎస్పి హాజరై మాట్లాడారు. తొగర్ పల్లి లో శివారులోని పరిశ్రమ యాజమాన్యాన్ని శ్రీధర్ రెడ్డి బెదిరింపులకు గురి చేస్తున్నాడని పీఎస్ లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ చాంబర్ లో ముందు అట్టి వ్యక్తిని కూర్చోబెట్టి మాట్లాడుతున్న మహిళా పోలీసు అధికారిణిపై అనుచిత వ్యాఖ్యలతో పదజాలాన్ని మాటలు అనడంతో కింద కూర్చోబెట్టి విచారించారు. అనుచిత వ్యాఖ్యలు చేయడం వల్లే పోలీసుల వద్ద వ్యక్తి మర్యాద పొడగొట్టుకోవడం వల్ల ఘటన జరిగిందన్నారు. సమస్య ఉంటే సంబంధిత పై అధికారులకు పిర్యాదు చేస్తే , గ్రామ సభ్యులతో చర్చిస్తే సమస్య పరిష్కారం అయ్యేదన్నారు. శ్రీధర్ రెడ్డిపై గతంలో ఐదు కేసులు ఉండడంతో తహసీల్దార్ ముందు బైండోవర్ చేశాము. తనపై కేసు అవుతుందని ముందే తెలిసి అలా చేసినట్లు వీడియోల్లో చెప్పడం గమనించాలని డిఎస్పి వెల్లడించారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ సుమన్, ఎస్సై సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



# అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి



**కానుకుంట, మే 8(సిరి న్యూస్):**

గ్రామ ప్రజలందరిపై పెద్దమ్మ తల్లి చల్లని కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఆకాంక్షించారు. గుమ్మడిదల మండల పరిధిలోని కానుకుంట గ్రామంలో శ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి తో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనడం సమాజానికి శుభపరిణామమని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు. దేవాలయాలు ప్రజల్లో ఐక్యత, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధితో పాటు ఆలయాల అభివృద్ధికి కూడా ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో వెంకటేష్ గౌడ్, హుస్సేన్, సత్యనారాయణ, సంజీవరెడ్డి, రమేష్, పద్మారెడ్డి, యాదగిరి యాదవ్, గోవర్ధన్ రెడ్డి, మహేందర్ రెడ్డి, రాజయ్య, యాదయ్య, రాములు, వెంకటేష్, సత్యనారాయణ, ముదిరాజ్ సంఘం పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వేసవికాలంలో తాగునీటి సరఫరాలలో అంతరాయం ఉండదు

- ప్రజలకు నీటి కష్టాలు రాకుండా ప్రత్యేక ఏర్పాటు
- మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్

**గుమ్మడిదల మే 8 ( సిరి న్యూస్):**

మున్సిపల్ పరిధిలోని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ఎక్కడికక్కడ ముందస్తుగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. మున్సిపాలిటీలోని 8వ వార్డులో వార్డు కౌన్సిలర్ బెంబడి సంజీవరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నూతన బోరు బావి ఏర్పాటు పనులను చైర్మన్ కుమార్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో తాగునీటి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రజలకు ఇబ్బంది కలగకుండా శాశ్వత పరిష్కార మార్గాలు చూపుతున్నామని తెలిపారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూస్తామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా ఎక్కడ అవసరమైతే అక్కడ కొత్త బోర్లు, పైప్‌లైన్లు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సంధ్యారెడ్డి, వార్డు కౌన్సిలర్లు గిద్దె విజయలక్ష్మి , మురళి, కిషన్, రమేష్, చక్రపాణి, నాయకులు తుపాకుల రాజు, హుస్సేన్, వెంకట్రాంరెడ్డి, సత్యనారాయణ, మద్ది శేఖర్ రెడ్డి, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, మహేష్ పార్టీ గ్రామ పెద్దలు, యువకులు పార్టీ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- మినీ మంచినీటి ట్యాంకును ప్రారంభించిన సర్పంచ్ ఇప్ప పెంటారెడ్డి



**గుమ్మడిదల (కానుకుంట), మే 8 (సిరి న్యూస్):**

గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఎస్సీ కాలనీలో మినీ మంచినీటి ట్యాంకు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు కానుకుంట గ్రామ సర్పంచ్ ఇప్ప పెంటారెడ్డి తెలిపారు. గుమ్మడిదల మండల పరిధిలోని కానుకుంట గ్రామపంచాయతీలోని ఎస్సీ కాలనీలో మినీ వాటర్ ట్యాంక్ ను ఆయన ప్రారంభించారు. కాలనీ వార్డు సభ్యులు ప్రేమ్ కుమార్, శ్రావణి నవీన్ తాగునీటి సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి మినీ మంచినీటి ట్యాంకు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు తాగునీరు అందించడం గ్రామపంచాయతీ ప్రధాన బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఎండాకాలంలో నీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి కాలనీ పరిస్థితిని పరిశీలిస్తూ అవసరమైన చోట్ల ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు ఎదురైన వెంటనే సమస్యలను గుర్తించి పరిష్కరించడం గ్రామపంచాయతీ లక్ష్యమని అన్నారు. ఎస్సీ కాలనీల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. గ్రామంలోని ప్రతి కుటుంబానికి మౌలిక వసతులు అందేలా దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని చెప్పారు. ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దేవేందర్ గౌడ్, ఉప సర్పంచ్ పాషా, వార్డు సభ్యులు ప్రేమ్ కుమార్, శ్రావణి నవీన్, పెంటేష్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజాత్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం యాదగిరి, పోతురాజు సుధాకర్, ఆశీర్వాదం, కుమ్మరి వెంకటేష్, పోచయ్య, నతనైలు, మురళి, కాంతి, ప్రవీణ్, గ్రామ పెద్దలు బాల్ రెడ్డి, రాజయ్య, చంద్రయ్య, కాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### మంచినీటి సమస్యకు పరిష్కారం

గుమ్మడిదల మండల పరిధిలోని కానుకుంట గ్రామ ఎస్సీ కాలనీలో ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న తాగునీటి సమస్యను గ్రామపంచాయతీ ప్రత్యేకంగా గుర్తించి వెంటనే చర్యలు చేపట్టారు దీంతో ఆ కాలనీలో మంచినీటి సమస్య తీరుతుందని కాలనీ ప్రజలు తెలిపారు.

# మెగా జాబ్ మేళా విజయవంతం

**ఉమ్మడి మెదక్ జిల్లాల నుంచి భారీగా యువత హాజరు**
**60 ప్రముఖ కంపెనీలతో ఉపాధి అవకాశాల కల్పన**
**అర్హులైన అభ్యర్థులకు త్వరలో నియామక ఉత్తర్వులు**



**సంగారెడ్డి, (సిరి న్యూస్):**

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించిన మెగా జాబ్ మేళాను శుక్రవారం సంగారెడ్డి జిల్లా తార డిగ్రీ కళాశాలలో విజయవంతంగా నిర్వహించినట్లు జిల్లా యువజన మరియు క్రీడల అధికారి అఖిలేష్ రెడ్డి తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, ప్రైవేట్ రంగ సంస్థలతో అనుసంధానం చేయడం లక్ష్యంగా నిర్వహించిన ఈ జాబ్ మేళాకు సంగారెడ్డి, మెదక్, సిద్ధిపేట జిల్లాల నుంచి సుమారు 1500 మంది యువతీ యువకులు హాజరయ్యారని తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఐటీ, మ్యానుఫ్యాక్చరింగ్, సర్వీస్ సెక్టార్‌లకు చెందిన సుమారు 60 ప్రముఖ కంపెనీలు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు, స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. అర్హత సాధించిన అభ్యర్థులకు సంబంధిత కంపెనీలు యువజన మరియు క్రీడల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో నియామక ఉత్తర్వులు అందజేయనున్నట్లు తెలిపారు.

# కాంగ్రెస్ కు డీఎంకే షాక్

**లోక్ సభ స్పీకర్ కు కనిమొళి కీలక లేఖ**

**న్యూఢిల్లీ ,సిరి న్యూస్,మే 8:**

తమిళనాడు రాజకీయాల్లో అనూహ్య మార్పు చోటుచేసుకుంది. బలమైన రాజకీయ శక్తిగా ఉన్న డీఎంకే, కాంగ్రెస్ పార్టీతో తమకున్న పొత్తు ముగిసిందని అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు డీఎంకే ఎంపీ కనిమొళి ఢిల్లీలో కీలక ప్రకటన చేశారు. దేశంలో మారుతున్న రాజకీయ పరిస్థితులు, సమీకరణాల దృష్ట్యా ఇకపై కాంగ్రెస్‌తో కలిసి నడవలేమని ఆమె స్పష్టం చేశారు. ఈ నిర్ణయం వెలువడిన వెంటనే పార్లమెంటరీ కార్యకలాపాల పరంగా కూడా డీఎంకే కీలక అడుగు వేసింది. లోక్‌సభలో తమ పార్టీ ఎంపీలకు ప్రత్యేక సీటింగ్ కేటాయించాలని కోరుతూ కనిమొళి స్పీకర్‌కు లేఖ రాశారు. ఇప్పటి వరకు సభలో కాంగ్రెస్ ఎంపీలతో కలిసి కూర్చున్న డీఎంకే సభ్యులు.. ప్రస్తుత పరిస్థితుల్లో వారితో కలిసి కూర్చోలేమని స్పష్టంగా పేర్కొన్నారు. తమ పార్టీకి చెందిన ఎంపీలందరికీ సభలో వేర్వేరుగా సీట్లు కేటాయించి, స్వతంత్రతను గౌరవించాలని ఆమె స్పీకర్‌ను విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్‌తో పొత్తు ముగియడం అనేది కేవలం ఎన్నికలకే పరిమితం కాకుండా, పార్లమెంట్ లోపల కూడా ప్రతిబింబించాలని డీఎంకే భావిస్తోంది. ఈ పరిణామం అటు తమిళనాడు రాష్ట్ర రాజకీయాల్లోనూ, ఇటు కేంద్రంలోని విపక్ష కూటముల్లోనూ పెను సంచలనంగా మారింది..

# మరోసారి పిఎసిఎస్ చైర్మన్ గా ఎన్నికైన చింతల వెంకటరామిరెడ్డి!

- ఆర్డర్ కాపీ అందజేసిన పిఎసిఎస్ సీఈవో గొల్ల మధు యాదవ్!!



**శివంపేట మే 8 ( సిరి న్యూస్ )**

శివంపేట మండలంలో మరోసారి పిఎసిఎస్ చైర్మన్ గా చింతల వెంకటరామిరెడ్డి పదవి బాధ్యతలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో పిఎసిఎస్ సీఈవో మధు ఆర్డర్ కాపీని అందజేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు సీఈవో మధు ఆర్డర్ కాపీని శివంపేట మండల పి ఎస్ సి ఎస్ చైర్మన్ వెంకటరామిరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ చైర్మన్ చింతల వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ మండల రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని, నాతోపాటు పాలకవర్గం కూడా రైతుల సంక్షేమం కోసమే కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి మరియు పిఎసిఎస్ డైరెక్టర్లు, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా, మాధవరెడ్డి, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పిల్లుట్ల గ్రామ సర్పంచ్ బుర్ర మురళి గౌడ్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు సుధీర్ రెడ్డి, మరియు వివిధ గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ సర్పంచులు, మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన తూప్రాన్ ఆర్డీవో

**వెల్దుర్తి,మే 08,(సిరి న్యూస్)**



వెల్దుర్తి మండల పరిధిలోని హాస్తాల్పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తూప్రాన్ ఆర్డీవో జయ చంద్రారెడ్డి, వెల్దుర్తి తహశీల్దార్ శ్రీనివాస్ ఆర్ఐ నర్సింగ్ యాదవ్ తో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. కేంద్రంలో ధాన్యం సేకరణ, తూకం చేసే విధానాన్ని వారు నిశితంగా పరిశీలించారు. యెల్దుర్తి గ్రామంలో ఉన్న మహా గణపతి రైస్ మిల్లును సందర్శించారు. మిల్లర్‌కు ధాన్యాన్ని త్వరితగతిన అన్‌లోడ్ చేయాలని అలాగే వేగంగా అన్‌లోడింగ్ జరగడానికి తగిన సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేయాలని సూచనలు ఇచ్చారు.ఐకేపీ ఏపీఎం, పిఎసిఎస్ సీఈఓ లతో మాట్లాడి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చెయ్యలని ఆదేశించారు. అలాగే రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లారీలల్లో ధాన్యం త్వరగా లోడింగ్ లో సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు.

## తెలంగాణలో బీసీ కులాల పేర్లు మార్పు..
### కొత్త పేర్లు ఇవే!



**తెలంగాణ బ్యూరో సిరి న్యూస్ మే 8 ;**

. తెలంగాణలోని వెనుకబడిన తరగతుల (బీసీ) చిరకాల వాంఛను నెరవేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలకమైన సామాజిక సంస్క రణకు శ్రీకారం చుట్టింది. సమాజంలో కించపరిచే విధంగా ఉన్న కొన్ని కులాల పేర్లను తొలగించి, వాటి స్థానంలో గౌరవప్రదమైన పేర్లను చేరుస్తూ రాష్ట్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. బీసీ కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ఆయా వర్గాల ఆత్మగౌరవం పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మార్పులు తక్షణమే రాష్ట్ర గెజిట్ ద్వారా అధికారిక రికార్డుల్లోకి రానున్నాయి.బీసీ గ్రూప్-ఏలో మార్పులు ప్రభుత్వం చేపట్టిన ఈ మార్పుల్లో బీసీ గ్రూప్-ఏ విభాగంలో అత్యధిక మార్పులు జరిగాయి. ముఖ్యంగా వినడానికి అసభ్యకరంగా ఉన్న పదాలను రికార్డుల నుంచి పూర్తిగా తొలగించారు.

**దొమ్మర:** ఈ పేరును తొలగించి గడ వంశీయ'గా మార్చారు.

**పిచ్చకుంట్ల:** ఇకపై ఈ కులస్తులను 'వంశ రాజ్'గా వ్యవహరిస్తారు.

**బుడబుక్కల:** వీరికి 'శివ క్షత్రియ' అనే గౌరవప్రదమైన పదాన్ని జోడించారు.

**వీరభద్రీయ:** వీరి కోరిక మేరకు 'వీరముష్టి, నెట్టి కోటల' అనే పదాలను పర్యాయపదాలుగా చేర్చారు.

**వన్నార్:**ఈ పదాన్ని తొలగించి, రజక/చాకలి వర్గాల కోసం 'ధోబీ' అనే పదాన్ని ఖరారు చేశారు.

గ్రూప్-డిలో 'శూద్ర' పదం తొలగింపు

బీసీ గ్రూప్-డి విభాగంలో కూడా ప్రభుత్వం సామాజిక స్పృహతో పలు మార్పులు చేసింది. ఎప్పటి నుంచో వివాదాస్పదంగా ఉన్న 'శూద్ర కులం' అనే పదాన్ని అధికారిక రికార్డుల నుంచి పూర్తిగా తొలగించారు. ఆ స్థానంలో 'తమ్మలి (బ్రాహ్మణేతర)'గా పేరు మారుస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనివల్ల ఆ వర్గానికి స్పష్టమైన సామాజిక గుర్తింపు లభిస్తుంది. అలాగే వరుస సంఖ్య 5లో ఉన్న 'మేర', 'చిప్పోలు' కులాలకు అదనంగా 'మేరు' అనే పదాన్ని చేర్చారు.

**విద్యార్థులు, ఉద్యోగార్థులకు మేలు**

ఈ నిర్ణయం వల్ల భవిష్యత్తులో విద్యార్థులు, ఉద్యోగార్థులు తమ కుల ధ్రువీకరణ పత్రాల్లో గౌరవప్రదమైన పేర్లను పొందే అవకాశం కలుగుతుంది. సమాజంలో పిలిచేటప్పుడు కలిగే ఇబ్బందులను తొలగించి, ఆయా వర్గాల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపడమే ఈ సంస్కరణ ముఖ్య ఉద్దేశమని బీసీ కమిషన్ వెల్లడించింది. కులాల పేర్ల మార్పుపై హర్షం వ్యక్తం చేస్తున్న బీసీ సంఘాలు, ఇది తమ సామాజిక హోదాను పెంచుతుందని అభిప్రాయపడుతున్నాయి.

# గంగకత్వ కాలువ ఆధునీకరణకు ప్రభుత్వం సమ్మతి

- జగ్గారెడ్డి కోరిక మేరకు రూ.42 కోట్ల విడుదలకు ప్రభుత్వం అంగీకారం
- 3,000 ఎకరాలకు గంగ కత్వ ద్వారా సాగునీరు
- దశాబ్దాలుగా ఆధునీకరణ కు నోచుకోని నిజాం కాలం నాటి గంగ కత్వ కాలువ
- ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆ శాఖ ఉన్నతాధికారుల తో సెక్రటేరియట్ లో సమావేశమైన జగ్గారెడ్డి
- గంగకత్వ ఆధునీకరణ పనులకు త్వరలో సీఎం రేవంత్ రెడ్డి తో శంఖుస్థాపన

**ప్రత్యేక ప్రతినిధి, మే08 (సిరి న్యూస్)**



సదాశివపేట మండలం సూరారం గ్రామం నుండి మొదలయ్యే నిజాం కాలం నాటి గంగ కత్వ కాలువ ఆధునీకరణ కు జగ్గారెడ్డి చొరవతో ఎట్టకేలకు మోక్షం లభించింది. నిజాం కాలం లో నిర్మించిన ఈ కాలువ ఇప్పటివరకు మరమ్మత్తు కు నోచుకోలేదు. దశాబ్దాల పాటు మరమ్మత్తుల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపుతున్న పనులకు మోక్షం కలుగలేదు. గంగ కత్వ ఆయకట్టు రైతులు , స్థానిక నేతల కోరిక మేరకు జగ్గారెడ్డి రెండు నెలల క్రితం నీటి పారుదల శాఖ అధికారుల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆధునీకరణ పనుల కోసం వెంటనే కొత్త ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించారు. కాలువ ఆధునీకరణ పనులకోసం నీటి పారుదల శాఖ అధికారులు రూ.42 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. ఆ ప్రతిపాదనలకు ప్రభుత్వం తాజాగా ఆమోదం తెలిపింది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులతో సెక్రటేరియట్ లో జగ్గారెడ్డి సమావేశం అయ్యారు. గంగకత్వ కాలువకు చేపట్టబోయే ఆధునీకరణ పనులపై ఈ సమావేశం లో చర్చించారు.

**ఆధునీకరణ పనులు ఇలా...**

గంగ కత్వ కాలువ సదాశివపేట మండలం సూరారం గ్రామం లో ప్రారంభం అయ్యి 11 గ్రామాలను కలుపుతూ సదాశివపేట మండలం లోని మాచిరెడ్డి పల్లి గ్రామం వరకు సుమారు 15 కిలో మీటర్ల పొడవునా విస్తరించి ఉంది. గంగకత్వ కాలువ కు 33 చెరువుల నుండి ఫీడర్ చానల్స్ ఉన్నాయి. ఆధునీకరణ పనుల్లో భాగంగా కాలువకు లైనింగ్ పనులు చేపడతారు. కాలువ పైన అవసరం ఉన్న చోట కొత్త బ్రిడ్జి ల నిర్మాణం, పాత వాటికి మరమ్మత్తు పనులు చేస్తారు. దీనితో పాటు కాలువ పొడవునా తుములకు రిపేర్లు చేస్తారు. ఈ కాలువ పనులు పూర్తయితే 3000 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చు.

**త్వరలో సీఎం రేవంత్ రెడ్డి తో శంకుస్థాపన**

... సీఎం రేవంత్ రెడ్డి త్వరలో సంగారెడ్డి కి రానున్న నేపథ్యం లో గంగకత్వ పనులకు సైతం సీఎం తో శంకుస్థాపన చేయించేందుకు జగ్గారెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు త్వరత గతిన ఏర్పాట్లు చేసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమక్షంలో జరిగిన సమావేశం లో అధికారులకు జగ్గారెడ్డి సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహా, ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకట స్వామి చేతుల మీదుగా గంగ కత్వ పనులకు శంకుస్థాపన జరుగుతుందని జగ్గారెడ్డి అధికారులకు వివరించారు.

# రిటైర్డ్ డీజీ సతీమణి తనూజ హత్య

- నేపాలీ గ్యాంగ్ పనే
- సీపీ సజ్జనార్

**తెలంగాణ బ్యూరో సిరి న్యూస్ మే8**

జూబ్లీహిల్స్‌లోని ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ వినయ్ రంజన్ రాయ్ సతీమణి తనూజ (55) హత్యకు గురయ్యారు. ఈ హత్యకు సంబంధించిన వివరాలపై హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. రిటైర్డ్ డీజీ సతీమణి తనూజ హత్య గావింపబడిందని తమకు మొదటగా సమాచారం వచ్చిందని తెలిపారు. రిటైర్డ్ డీజీ భార్య తనూజను నిన్న (గురువారం) రాత్రి రెండు గంటలకు దుండగులు హత్య చేశారని చెప్పుకొచ్చారు. నేపాలి గ్యాంగ్ పనిగా ప్రాథమికంగా తాము ఒక అంచనాకు వచ్చామని అన్నారు. కొన్ని క్లూస్ లభించాయని.. ఆ క్లూస్ ఆధారంగా ఈ కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నేపాలి పనివాళ్లపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**పనిమనిషి కల్పన ఈ హత్య చేసింది..**



నేపాలి పని మనుషులు ఇంట్లో ఎవరూ లేనప్పుడు నేరాలకు పాల్పడుతున్నారని సీపీ సజ్జనార్ చెప్పుకొచ్చారు. నిన్న (గురువారం) రాత్రి రిటైర్డ్ డీజీ ఇంట్లో ఎవరు లేనప్పుడు పనిమనిషి కల్పన అనే మహిళ మరికొందరితో కలిసి ఈ క్రైమ్ చేసిందని తెలిపారు. నిందితులు వెనుకాల గేటు నుంచి ఇంట్లోకి ప్రవేశించారని పేర్కొన్నారు. ఈ ఘటన సమయంలో పిల్లలు ఇద్దరు పై ఫ్లోర్‌లో ఉన్నారని.. తనూజ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్నారని వెల్లడించారు. ఇంట్లో ఉన్న పనిమనిషి కల్పనాతో బయట వ్యక్తులు కాంటాక్ట్ పెట్టుకొని ఈ క్రైమ్ చేశారని చెప్పారు. ప్రజలు భయాందోళనకు గురికావొద్దని.. నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

**వాళ్లపై నిఘా ఉంచాలి..**

నేపాలి పనిమనుషులు ఇంట్లో ఏడాది, రెండో ఏడాది పనిచేసిన కూడా వాళ్లపై నిఘా ఉంచాలని సీపీ సజ్జనార్ అన్నారు. ఈ కేసును చాలా సీరియస్‌గా తీసుకుంటున్నామని తెలిపారు. చేతులు కట్టేసి నోట్లో గుడ్డలు కుక్కి ఆమెను ఈ గ్యాంగ్ హత్య చేసిందని చెప్పారు. రిటైర్డ్ డీజీ తల్లి కోసం తనూజ హైదరాబాద్ వచ్చారని తెలిపారు. ఇటీవల రిటైర్డ్ డీజీ తల్లి మరణించారని.. అప్పటి నుంచి మృతురాలు తనూజ ఇక్కడే ఉంటున్నారని వివరించారు. ఈ కేసులో ఎంత బంగారం, నగదు పోయిందనే అంశాలపై ఆరా తీస్తున్నామని సీపీ సజ్జనార్ తెలిపారు..

# అక్రమ బియ్యం పట్టివేత

**తూప్రాన్ మే 8 సిరి న్యూస్**

తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని టోల్ ప్లాజా వద్ద శుక్రవారం పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల అనుమానాస్పదంగా వెళ్తున్న ఒక లారీని తనిఖీ చేయడం చేయడంతో లారీలో ఇలాంటి అనుమతులు లేని 250 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించి, పరిశీలన నిమిత్తం సివిల్ సప్లై కార్యాలయానికి తరలించడం జరిగింది.వాహన డ్రైవర్ తెలిపిన వివరాల ప్రకారం, లారీ కర్ణాటక రాష్ట్రం నుండి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి వెళ్తున్నట్లు తెలిసింది. సివిల్ సప్లై అధికారులకు సమాచారం అందజేయగా, వారి నివేదిక ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు



# అమ్మవారి కృపతో ప్రతి ఇంట సౌభాగ్యం నిండాలి ఎమ్మెల్యే





- ప్రజాక్షేమమే నా ధ్యేయం అమ్మవారి ఆశీస్సులు మనందరిపై ఉండాలి
- కొర్లకుంట చిత్తారమ్మ విగ్రహ ప్రతిష్టాపనలో ఎమ్మెల్యే

**జిన్నారం మే 8 సిరి న్యూస్**

జిన్నారం మున్సిపల్ పరిధిలోని కొర్లకుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ చిత్తారమ్మ దేవాలయంలో శుక్రవారం నిర్వహించిన అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించి నూతన దేవాలయాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జనార్దన్ ముదిరాజ్, మాజీ జెడ్పిటీసి బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు , సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, ప్రకాశ్ చారి, నరసింహ, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# లిఫ్ట్ లో ఇరుక్కుని మృతిచెందిన బాలుడు

**రామచంద్రపురం, మే 8, (సిరి న్యూస్):**

గుంటూరు జిల్లా సత్తెనపల్లి చెందిన వెంకటేశ్వర్లు తన కుటుంబ సభ్యులతో కలిసి గత ఫిబ్రవరిలో రాంచంద్రపురం వచ్చాడు. రామచంద్ర రెడ్డి నగర్ కాలనీ లోని మల్లారెడ్డి నివాసంలో వాచ్మెన్ గా పనిచేస్తున్నాడు. అతని నాలుగేళ్ల కుమారుడు గిరివర్ధన్ శుక్రవారం రాత్రి ఏడు గంట సమయంలో ఆడుకుంటూ లిఫ్టులోకి వెళ్లాడు. మొదటి అంతస్తులో లిఫ్ట్ వద్ద పెద్ద శబ్దం రావడంతో అందరూ లిఫ్ట్ వద్దకు వెళ్లి తలుపు తీసి చూడగా గిరివర్ధన్ లిఫ్టులు ఇరుక్కుని తీవ్ర గాయాలు పాలయ్యాడు. వెంటనే 108 అంబులెన్స్ లో పటాన్చెరు




ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని పోలీసు తెలిపారు.సంఘటన స్థలాన్ని ఏసిపి శ్రీనివాస్ కుమార్ ,సిఐ జగన్నాథ్ , హైడ్రా రిస్కీ టీమ్ సందర్శించారు.

# ప్రాణహిత బ్యారేజ్ స్థలాన్ని పరిశీలించిన మంత్రులు


### త్వరలో మహారాష్ట్ర సీఎంతో భేటీ

**(సిరి న్యూస్) కాగజ్నగర్:** కౌటాల మండలంలోని తుమ్మిడి హెట్టి గ్రామం వద్ద నిర్మించనున్న ప్రాణహిత బ్యారేజ్ స్థలాన్ని రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి శుక్రవారం పరిశీలించారు. ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించిన వారు బ్యారేజ్ ఎత్తు, కాల్వల సామర్థ్యం, నీటి నిల్వలపై ఇరిగేషన్ అధికారుల ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తుమ్మిడిహెట్టి పుష్కర ఘాట్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రులు మాట్లాడారు. ప్రాణహిత బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం తరపున ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్కు లేఖ రాశారని తెలిపారు. వచ్చే వారం మహారాష్ట్ర సీఎంతో సమావేశమై బ్యారేజ్ ఎత్తును ఖరారు చేసే దిశగా చర్చలు జరుపుతామని పేర్కొన్నారు. మహారాష్ట్రలో ముంపు ప్రభావిత ప్రాంతాల రైతులకు తగిన నష్టపరిహారం అందించి వారిని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. గత కేసీఆర్ ప్రభుత్వం ప్రాణహిత ప్రాజెక్టును మేడిగడ్డకు తరలించడం ద్వారా తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. ఈ సమావేశంలో సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు, ఎమ్మెల్సీ దండే



విఠల్, బెల్లంపల్లి ఎమ్మెల్యే జి.వినోద్, జిల్లా కలెక్టర్ హరిత, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, అదనపు కలెక్టర్ డేవిడ్, ఇరిగేషన్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోజుకు రెండు చాలు..



డ్రై ఫ్రూట్స్‌లో కూడా ఒకటి. ఖర్జూరంలో ఉండే పోషకాలు అన్నీ ఇన్నీ కావు. మనిషి శరీరానికి కావాల్సినన్ని విటమిన్లు, మినరల్స్ ఖర్జనూరంలో లభిస్తాయి. ప్రతి రోజూ రెండు ఖర్జూరాలు తింటే ఎంతో ఆరోగ్యంగా ఉంటారు. అంతే కాకుండా అనారోగ్య సమస్యలు కూడా దరి చేరవు. ముఖ్యంగా బాడీలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఖర్జూరాల్లో రెండు రకాలు ఉంటాయి. ఒకటి పచ్చివి. రెండోది ఎండిన ఖర్జూరాలు. ఎండిన ఖర్జూరాలను రాత్రంతా నానబెట్టి ఉదయం తింటే ఇంకా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఖర్జూరాలతో కేవలం ఆరోగ్య ప్రయోజనాలే కాకుండా చర్మం, జట్టు సమస్యల్ని కూడా తగ్గించుకోవచ్చు. అయితే ఇవి కేవలం సీజనల్ వారీగానే లభ్యమవుతాయి. కానీ వీటిని ప్రిజర్వేట్ చేసి అన్ని కాలాల్లో అందుబాటులోకి తీసుకొచ్చారు. ముఖ్యంగా చలికాలంలో వీటిని తప్పనిసరిగా తీసుకోవాలని సూచిస్తున్నారు. ఖర్జూరంలో విటమిన్లు, పొటాషియం, కాల్షియం, ఖనిజాలు, ఫైబర్, పాస్ఫరస్, కాపర్, మెగ్నీషియం పుష్కలంగా లభిస్తాయి.

## గుండె ఆరోగ్యానికి భరోసా..

గుండె ఆరోగ్యానికి భరోసా దక్కుతుంది. వీటిలో ఉండే మెగ్నీషియం, పొటాషియం.. రక్తపోటును తగ్గించి, గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. అందాన్ని రెట్టింపు చేయడంలోనూ ఖర్జూరాలు ముందుంటాయి. వీటిని రోజుకు రెండు చొప్పున తింటే.. చర్మం కాంతిమంతంగా తయారవుతుంది. ఖర్జూరలో ఉండే యాంటి ఆక్సిడెంట్లు, విటమిన్లు.. చర్మ ఆరోగ్యాన్ని సంరక్షిస్తాయి.రక్తహీనతకు ఖర్జూరాలు విరుగుడులా పనిచేస్తాయి. ఇవి శరీరంలో ఇనుమును పెంచి.. రక్తహీనతను దూరం చేస్తాయి.ఖర్జూరలో ఉండే విటమిన్ ఎ, విటమిన్ సి, ఇతర యాంటి ఆక్సిడెంట్లు.. శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతాయి.మలబద్ధకం సమస్యను నివారించడంలో ఖర్జూరం సమర్థంగా పనిచేస్తుంది. దీనిలో ఉండే ఫైబర్.. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.ఖర్జూరలో ఉండే మెగ్నీషియం, కాల్షియం, పాస్ఫరస్.. ఎముకల దృఢత్వాన్ని పెంచుతాయి.

**రక్త హీనత కంట్రోల్:** రోజూ రెండు ఖర్జూరాలను తినడం వల్ల రక్త హీనత సమస్య అదుపులోకి వస్తుంది. ఖర్జూరాల్లో ఐరన్ కంటెంట్, విటమిన్ సి మెండుగా లభ్యమవుతాయి కాబట్టి.. వీటిని తింటే రక్త హీనత లోపం నుంచి బయట పడొచ్చు. నానబెట్టిన ఖర్జూరాలైనా తినొచ్చు. ఖర్జూరాల్లో మెగ్నీషియం, పొటాషియం వంటివి పుష్కలంగా లభిస్తాయి. ఇవి రక్త పోటును నియంత్రించడానికి బాగా సహాయ పడుతుంది. అంతే కాకుండా కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి, గుండె ఆరోగ్యాన్ని కూడా మెరుగు పరుస్తుంది.

**బ్రెయిన్ హెల్దీ:** ఖర్జూరాల్లో మెగ్నీషియం, విటమిన్ బి 6 పుష్కలంగా ఉంటాయి. ఇవి మెదడులోని ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి. అదే విధంగా తెలివి తేటలను కూడా పెంచుతాయి. ఖర్జూరాలు తింటే బ్రెయిన్ యాక్టీవ్‌గా ఉంటుంది. పిల్లలకు ఇవ్వడం చాలా మంచిది.ఖర్జూరాల్లో ఫాస్ఫరస్, క్యాల్షియం, మెగ్నీషియం లభిస్తాయి కనుక.. వీటిని తింటే ఎముకలు బలంగా, దృఢంగా ఉంటాయి. అంతే కాకుండా ఎముకలకు వచ్చే సమస్యలు కూడా తగ్గుతాయి.

**చర్మం, జుట్టు ఆరోగ్యం:** ప్రతి రోజూ ఖర్జూరాలను తినడం వల్ల చర్మం, జుట్టు ఆరోగ్యంగా ఉంటాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు జుట్టు రాలకుండా, చర్మం అందంగా మెరిసేలా చేస్తుంది

# నాలుకపై మచ్చలు అదృష్టం కాదు

నాలుకపై నల్లటి మచ్చలు కనిపిస్తే అదృష్టమని, వారు ఏదైనా చెబితే చాలా వరకు నిజం అవుతుందని కొందరు నమ్ముతుంటారు. కానీ ఇది కేవలం మూఢ నమ్మకం మాత్రమే అంటున్నారు ఆరోగ్య నిపుణులు. నాలుకపై నల్లటి, తెల్లటి, ఎర్రటి రంగుల్లో ఏర్పడే మచ్చలు వాస్తవానికి శరీరంలో ప్రారంభమయ్యే కొన్ని రకాల వ్యాధుల లక్షణాలు కూడా కావచ్చునని చెబుతున్నారు. ముఖ్యంగా ల్యూకోప్లాకియా లేదా ఓరల్ థ్రష్, క్యాన్సర్ వంటి వ్యాధుల ప్రారంభం లక్షణాల్లో నాలుకపై మచ్చలు ఏర్పడే అవకాశం ఉందని అంటున్నారు. కాఫీ లేదా రెడ్ వైన్ వంటి కొన్ని ఆహారాలు లేదా పానీయాలు తీసుకోవడం వంటి హానిచేయని కారణాల వల్ల అవి సంభవించవచ్చు, అయితే నల్ల మచ్చలు కొన్నిసార్లు అంతర్లీన ఆరోగ్య సమస్యలను సూచిస్తాయి.



## ల్యూకోప్లాకియా వ్యాధి

కేవలం మచ్చలే కాకుండా నాలుక ఆధారంగా పలు రోగాలను గుర్తింవచ్చునని వైద్య నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా నల్లటి, తెల్లటి మచ్చలు మచ్చలు కనిపించడం, క్రీమ్ వంటి తెల్లటి పదార్థం నాలుకపై ఉత్పత్తి అవుతుండటం అనుమానించ దగినవివే. ఎందుకంటే ఇవి క్యాన్సర్ వచ్చే అవకాశం ఉన్నప్పుడు సంభవించే లక్షణాలని పేర్కొంటున్నారు. అట్లనే కొన్నిసార్లు ఫంగల్ ఇన్ఫెక్షన్స్ వల్ల కూడా నాలుకపై తెల్లటి మచ్చలు ఏర్పడవచ్చు. నల్లటి మచ్చలు ఏర్పడి క్రీమ్ వంటి పదార్థం ఎక్కువగా కనిపిస్తే అది ల్యూకోప్లాకియా వ్యాధికి దారితీస్తుందని, క్రమంగా క్యాన్సర్‌గా మారే అవకాశం ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కాబట్టి నాలుకపై అనుమానాస్పద మచ్చలు కనిపిస్తే వెంటనే వైద్య నిపుణులను సంప్రదించడం ఉత్తమం. మానవ నాలుక అనేది పాపిల్లె అని పిలువబడే చిన్న గడ్డలతో కప్పబడిన ఒక ఆకర్షణీయమైన కండరం, ఇది మన రుచి మొగ్గలను కలిగి ఉంటుంది. ఈ ఇంద్రియ అవయవాలు మనకు వివిధ రకాల రుచులను ఆస్వాదించడానికి అనుమతిస్తాయి. అప్పడప్పుడు, ఈ పాపిల్లె చనిపోయిన చర్మ కణాలు, శిథిలాలు లేదా ఆహార రంగులను బంధించి, నల్ల మచ్చల రూపాన్ని సృష్టిస్తాయి. నిరపాయకరమైన తాత్కాలిక భాషా పాపిలిటిస్ లేదా "వెంట్రుకల నాలుక" అని పిలువబడే ఈ పరిస్థితి సాధారణంగా హానిచేయనిది. మీ నాలుకను సున్నితంగా బ్రష్ చేయడంతో సహా మంచి నోటి పరిశుభ్రత సాధారణంగా దానిని క్లియర్ చేస్తుంది.

### ఫోలిక్ యాసిడ్ లోపం

ఫోలిక్ ఆమ్లం లేదా విటమిన్ బీ9, కణాల పెరుగుదల మరియు డీఎన్ఏ సంశ్లేషణకు ముఖ్యమైనది. ఫోలిక్ ఆమ్లం లోపం వల్ల నోటిలో గ్లోసిటిస్ మరియు నాలుక రంగులో మార్పులు వంటివి వస్తాయి. నాలుక ఉపరితలంపై ఉండే ఎపిథీలియల్ కణాలలో మార్పుల వల్ల నల్ల మచ్చలు ఏర్పడవచ్చు.

### ఆహార మార్పులు

విటమిన్ బి 12, ఐరన్ మరియు ఫోలిక్ యాసిడ్ అధికంగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా మీ ఆహారాన్ని మెరుగుపరచుకోవడం వల్ల లోపాలను పరిష్కరించడంలో మరియు నోటి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. లీన్ మీట్స్, చేపలు, గుడ్లు, పాల ఉత్పత్తులు, ఆకుకూరలు, చిక్కుళ్ళు మరియు బలవర్ధకమైన తృణధాన్యాలు వంటి వనరులను మీ ఆహారంలో చేర్చుకోండి.

### సప్లిమెంట్స్

తీవ్రమైన లోపాల సందర్భాలలో లేదా ఆహారంలో మార్పులు సరిపోకపోతే సప్లిమెంట్లను సిఫార్సు చేయవచ్చు. మీ అవసరాలకు తగిన మోతాదు మరియు సప్లిమెంట్ల రకాన్ని నిర్ణయించడానికి ఆరోగ్య సంరక్షణ నిపుణుడిని లేదా నమోదిత డైటీషియన్‌ను సంప్రదించండి.

### పర్యవేక్షణ అవసరం

మీ నాలుకలో నల్ల మచ్చలు లేదా ఏవైనా మార్పులు కనిపిస్తే, క్షుణ్ణంగా మూల్యాంకనం కోసం దంతవైద్యుడు లేదా ఆరోగ్య సంరక్షణ ప్రదాతను సంప్రదించండి. వారు మీ నోటి ఆరోగ్యాన్ని అంచనా వేయగలరు, ఏవైనా అంతర్లీన లోపాలు లేదా పరిస్థితులను గుర్తించగలరు మరియు తగిన చికిత్సను సిఫార్సు చేయగలరు.

### నోటి పరిశుభ్రత పద్ధతులు

నాలుక ఆరోగ్యంతో సహా మొత్తం నోటి ఆరోగ్యానికి మంచి నోటి పరిశుభ్రతను కాపాడుకోవడం చాలా ముఖ్యం. రోజుకు రెండుసార్లు మీ దంతాలను బ్రష్ చేయండి, నాలుకను స్క్రాపర్ లేదా టూత్ బ్రష్‌తో శుభ్రం చేయండి మరియు నాలుక రంగు మారడానికి దోహదపడే ఫలకం మరియు బ్యాక్టీరియాను తొలగించడానికి క్రమం తప్పకుండా ఫ్లాస్ చేయండి.

### వైద్య చికిత్స

కొన్నిసార్లు, నాలుకపై నల్ల మచ్చలు అంతర్లీన వైద్య పరిస్థితుల వల్ల లేదా మందుల వల్ల సంభవించవచ్చు. లోపాలు తోసిపుచ్చబడితే లేదా పరిష్కరించబడితే మరియు నల్ల మచ్చలు కొనసాగితే, మరింత మూల్యాంకనం మరియు చికిత్స అవసరం కావచ్చు.

### విటమిన్ బి12 లోపం

ఎర్ర రక్త కణాల నిర్మాణం, నరాల పనితీరు మరియు డీఎన్ఏ సంశ్లేషణకు విటమిన్ డీ12 చాలా ముఖ్యమైనది. ఈ విటమిన్ లోపం వల్ల నోటి సమస్యలు వస్తాయి, వాటిలో గ్లాసిటిస్ (నాలుక వాపు) మరియు నాలుక రంగు మారడం వంటివి ఉంటాయి. నాలుక ఉపరితలంపై ఉన్న పాపిల్లేలో మార్పుల కారణంగా నల్ల మచ్చలు కనిపించవచ్చు.

### ఇనుము లోపం

శరీరంలో ఆక్సిజన్ రవాణాకు మరియు నాలుకతో సహా ఆరోగ్యకరమైన కణజాలాలను నిర్వహించడానికి ఇనుము చాలా అవసరం. ఇనుము లోపం, లేదా ఇనుము లోపం అనీమియా, నాలుక యొక్క రూపంలో మార్పులకు కారణమవుతుంది, ఉదాహరణకు నల్ల మచ్చలు లేదా కణజాలం నల్లబడటం. ఈ పరిస్థితి గ్లోసిటిస్ మరియు ఇతర నోటి లక్షణాలకు కూడా దారితీయవచ్చు.



## బాలీవుడ్ తీరుపై సిమ్రాన్ ఫైర్.. సౌత్ స్టార్స్‌ను జీరోగా చూస్తారంటూ సంచలన వ్యాఖ్యలు

సీనియర్ హీరోయిన్ సిమ్రాన్.. ఈ పేరు వినగానే తెలుగు, తమిళ ప్రేక్షకులకు ఆమె అద్భుతమైన డ్యాన్స్, నటన గుర్తొస్తాయి. దశాబ్దాల పాటు దక్షిణాది చిత్ర పరిశ్రమలో అగ్ర కథానాయికగా వెలిగిన సిమ్రాన్, తాజాగా హిందీ చిత్ర పరిశ్రమ (బాలీవుడ్) తీరుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. సౌత్ నటుల పట్ల బాలీవుడ్ ప్రదర్శించే వివక్షను ఎండగడుతూ ఆమె వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారాయి. బాలీవుడ్‌లో ఎదురయ్యే ఇబ్బందుల గురించి సిమ్రాన్ మాట్లాడుతూ.. "చాలా సార్లు నాకు హిందీ సినిమాల్లో అవకాశాలు వచ్చాయి, కానీ వాటన్నింటినీ నేను తిరస్కరించాను. అక్కడ వారితో సరైన కమ్యూనికేషన్ కుదరదు. మేము సౌత్‌లో సంపాదించుకున్న పేరును, మాకున్న లెగసీని వారు అస్సలు గుర్తించరు. మేము ఏదో సున్నా నుంచి మొదలుపెడుతున్న కొత్త నటుల్లాగా మాతో వ్యవహరిస్తారు. ఇది నన్ను తీవ్రంగా కలిచివేస్తుంది" అని ఆవేదన వ్యక్తం చేశారు.

సినిమాల కోసం సగం జీవితాన్ని ధారపోసినా, సీనియర్ నటులకు కనీస గౌరవం దక్కకపోవడం బాధాకరమని సిమ్రాన్ మండిపడ్డారు. ముఖ్యంగా వసతి సౌకర్యాల విషయంలో కూడా బాలీవుడ్ నిర్మాతలు బేరసారాలు ఆడతారని ఆమె వెల్లడించారు. "మా వెంట వచ్చే స్టాఫ్ సంఖ్యను పరిమితం చేస్తారు. హోటల్ గదులు, విమాన టిక్కెట్ల విషయంలోనూ రాజీపడమంటారు. ఇవన్నీ చూడటానికి చిన్న విషయాలుగా అనిపించవచ్చు, కానీ దశాబ్దాల కాలం సినిమా కోసం ప్రాణమిచ్చిన మా లాంటి వారికి ఇది అవమానకరంగా అనిపిస్తుంది. అక్కడ ఉండే ఆధిపత్యం చూశాక పనిచేయాలనే ఆసక్తి పోతుంది" అని ఆమె వాపోయారు. బాలీవుడ్‌లో చేదు అనుభవాలు ఉన్నప్పటికీ, అందరూ అలా ఉండరని సిమ్రాన్ స్పష్టం చేశారు. బాలీవుడ్ స్టార్ హీరో సన్నీ డియోల్ గురించి ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు. సన్నీ డియోల్ ఎంతో వినయపూర్వకంగా ఉంటారని, ఆయనతో కలిసి పనిచేయడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఆమె కొనియాడారు. కేవలం సౌత్ నటి అనే వివక్ష చూపకుండా గౌరవించే వ్యక్తులు అక్కడ చాలా తక్కువ మంది ఉన్నారని సిమ్రన్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం సిమ్రాన్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, దక్షిణాది నటులకు మద్దతుగా నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.



## బాలయ్యతో అలా చేస్తేనే అసలైన కిక్ అంటున్న హాట్ బ్యూటీ..

నందమూరి బాలకృష్ణ గురించి సోషల్ మీడియాలో వచ్చే విమర్శలను బాలీవుడ్ హాట్ బ్యూటీ ఊర్వశి రౌతేలా పూర్తిగా తిప్పికొట్టారు. 'డాకు మహారాజ్' సినిమాలో ఆయన సరసన నటించిన ఊర్వశి, బాలయ్య వ్యక్తిత్వం గురించి చెబుతూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. బాలయ్యను ఒక 'జెంటిల్‌మెన్'గా చెబుతూ ఊర్వశి తన మనసులోని మాటను పంచుకున్నారు. బాలయ్య దూకుడు కేవలం కెమెరా ముందే కాదు.. నిజ జీవితంలో కూడా అలాగే ఉంటుందని అయితే దాని వెనుక ఒక చిన్న పిల్లాడి మనస్తత్వం దాగి ఉందని ఆమె తెలిపింది. బాలకృష్ణ వంటి సీనియర్ స్టార్‌తో పనిచేసే అవకాశం రావడం తన అదృష్టమని ఊర్వశి గర్వంగా చెబుతున్నారు. "ఆయనతో గడిపిన ప్రతి క్షణం నాకు చాలా గొప్ప అనుభూతిని ఇచ్చింది. సెట్‌లో ఆయన ఇచ్చే ఎనర్జీ మామూలుగా ఉండదు" అని ఆమె ప్రశంసల వర్షం కురిపించారు. ముఖ్యంగా ఆయనతో కలిసి యాక్షన్ సీన్లు అంటేనే అసలైన కిక్ అని.. బాలయ్యలో ఉన్న క్రమశిక్షణ తనను ఎంతో ఆకట్టుకుందని ఊర్వశి వివరించారు. బాలయ్య తన ఫ్యాన్స్‌పై కోప్పడటం లేదా ఫోన్లు విసిరేయడం వంటి ఘటనలపై వస్తున్న విమర్శలకు ఊర్వశి తనదైన శైలిలో సమాధానమిచ్చారు. "బాలయ్య గారు అలా చేస్తుంటే నాకు చాలా సరదాగా అనిపించేది. అది ఆయన సహజ సిద్ధమైన స్వభావం. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే, ఆయన ఎవరి మీదైనా కోప్పడితే ఆ అభిమానులు కూడా బాధపడరు, పైగా సంతోషిస్తారు. ఆయన చేసే పనుల వెనుక ఉన్న ప్రేమను వాళ్లు అర్థం చేసుకుంటారు" అని ఊర్వశి పేర్కొన్నారు. బయట వాళ్లు అనుకునే దానికి, సెట్‌లో ఉండే వాతావరణానికి చాలా తేడా ఉంటుందని ఆమె స్పష్టం చేశారు.బాలయ్యకు, తనకు మధ్య ఉన్న స్నేహం గురించి చెబుతూ ఊర్వశి ఒక ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. గతేడాది వాలెంటైన్స్ డే రోజున తనకు మొదటి విష్ బాలయ్య నుంచే రావడంతో.. ఒక స్టార్ హీరోగా ఉండి కూడా అందరినీ సమానంగా చూసే ఆయన గుణం ఊర్వశిని ఫిదా చేసింది. కేవలం నటనలోనే కాదు, మనుషులను గౌరవించడంలో కూడా బాలయ్య గొప్ప వ్యక్తి అని ఊర్వశి కితాబిచ్చారు. మొత్తానికి 'డాకు మహారాజ్' సినిమా షూటింగ్ ఊర్వశికి ఒక మరపురాని జ్ఞాపకంగా మిగిలిపోయినట్లు కనిపిస్తోంది.



## జ్ఞాపకాలను గుర్తుచేసుకోవడం ఇష్టంలేక ఆ సినిమానే పూర్తిగా మర్చిపోయా..

నేచులర్ బ్యూటీ సాయి పల్లవి రీసెంట్‌గా బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. అమిర్ ఖాన్ తనయుడు జునైద్ హీరోగా నటించిన 'ఏక్ దిన్' చిత్రం మే 1న ప్రేక్షకుల ముందుకు వచ్చి మొదటి షోతోనే నెగిటివ్ టాక్ తెచ్చుకుంది. ఈ చిత్రం డిజాస్టర్ అందుకోవడంతో సాయిపల్లవి బాలీవుడ్ ఎంట్రీపై కూడా విమర్శలు వచ్చాయి. అయితే.. ఈ సినిమాలో తన పాత్రకు తగిన న్యాయం చేయలేదని సాయి పల్లవి ముందే చెప్పిందట. అలాగే ఈ సినిమా ఎందుకు ఒప్పుకోవాల్సి వచ్చిదో ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. 'ఏక్ దిన్ స్క్రిప్ట్ నాకు బాగా నచ్చింది. స్టోరీ చెప్పగానే ఓకే చెప్పేశాను. అయితే ప్రీమియర్ షో చూసిన తర్వాత ఈ పాత్రకు నేను సరిపోలేదని నాకు అనిపించింది. ఇదే మాట ఆమిర్ ఖాన్‌తో చెప్పా. 'ఈ పాత్రకు నన్ను కాకుండా మరొకరిని ఎంపిక చేసి ఉంటే బాగుండేదేమో. చురుగ్గా, హుషారుగా ఉండే కొత్త అమ్మాయిని ఎంపిక చేసి ఉండాల్సింది. వాళ్లు ఈ పాత్రకు బాగా న్యాయం చేసేవాళ్లు' అని నా మనసులో మాటను ఆమిర్తో చెప్పా' అన్నారు. సినిమా డిజాస్టర్ కావడంతో సాయి పల్లవి కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.



## రామ్ చరణ్ 'పెద్ది' బాక్సాఫీస్ విధ్వంసం.. నార్త్ అమెరికాలో ఆల్ టైమ్ రికార్డ్!

రామ్ చరణ్ 'పెద్ది'పై భారీ అంచనాలు ఉన్న విషయం తెలిసిందే. బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న ఈ స్పోర్ట్స్ డ్రామా కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. జూన్ 4న విడుదల కానున్న ఈ సినిమా ఒకరోజు ముందుగానే విదేశాల్లో సందడి చేయనుంది. తాజాగా అక్కడ ప్రీ సేల్ బుకింగ్స్ ఓపెన్ చేయగా టికెట్స్ హాట్‌కేకుల్లా అమ్ముడయ్యాయి. 24 గంటలు కూడా కాకముందే లక్ష టికెట్స్ సేల్ అయ్యాయి. దీంతో నార్త్ అమెరికాలో అత్యంత వేగంగా ఇన్ని టికెట్స్ అమ్ముడైన తొలి సినిమాగా 'పెద్ది' రికార్డు నెలకొల్పింది.

ట్రైలర్ కూడా విడుదల కాకముందే ఈ స్థాయిలో టికెట్స్ సేల్ కావడంతో అభిమానులు సంబరపడుతున్నారు. సినిమా విడుదలకు ఇంకా చాలా రోజులు ఉండడంతో అప్పటివరకూ మరిన్ని రికార్డులు సొంతం చేసుకోవడం ఖాయమని భావిస్తున్నారు. మరోవైపు 'పెద్ది' పోస్ట్ ప్రొడక్షన్ పనులన్నీ పూర్తయ్యాయి. తాజాగా ఎడిటింగ్ కూడా పూర్తయిందని దర్శకుడు తెలిపారు. త్వరలోనే ట్రైలర్‌ను విడుదల చేసే అవకాశం ఉంది. ట్రైలర్ విడుదలైన అనంతరం టికెట్స్ భారీగా సేల్ అవ్వొచ్చని సినీవర్గాల సమాచారం. ఎమోషన్ ప్రధానంగా తెరకెక్కిన ఈ కమర్షియల్ సినిమా అందరికీ కనెక్ట్ అవుతుందని దర్శకుడు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పెద్దిని మన హృదయాల్లోంచి తీసేయడం అంత తేలిక కాదని బుచ్చిబాబు తాజాగా చెప్పారు.





## ఎన్టీఆర్ – రామ్ చరణ్ మరోసారి.. ఫ్యాన్స్ కు పూనకాలే

ఆర్ఆర్ఆర్ సినిమాలో రామ్ చరణ్, మాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ ను ఒకే ఫ్రేమ్ లో చూసి మురిసిపోయిన అభిమానులకు మైత్రీ మూవీ మేకర్స్ ఒక భారీ సర్ప్రైజ్ ప్లాన్ చేస్తోంది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన పెద్ది సినిమా విడుదలతో పాటు గ్లోబల్ స్టార్ ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న డ్రాగన్ గ్లింప్స్‌ను థియేటర్లలో ప్రదర్శించబోతున్నట్లు సమాచారం. ఈ వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది. మైత్రీ మూవీ మేకర్స్ ఈ రెండు భారీ చిత్రాల నిర్మాణంలో భాగస్వామిగా ఉన్న సంగతి తెలిసిందే.

జూన్ 4న విడుదల కానున్న 'పెద్ది' సినిమాతో పాటు ఎన్టీఆర్ పుట్టినరోజు కానుకగా ఈ నెల 20న రానున్న 'డ్రాగన్' గ్లింప్స్‌ను జతచేస్తే రామ్ చరణ్ సినిమా చూస్తున్నప్పుడు ఎన్టీఆర్ గ్లింప్స్ రావడం అనేది థియేటర్లలో ఫ్యాన్స్‌కు ఐఫీస్ట్ అని చెప్పవచ్చు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ 'డ్రాగన్'గా ఎలా ఉండబోతున్నారో తెలుసుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే రవి బస్రూర్ దీనికి సంబంధించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ పనుల్లో నిమగ్నమై ఉండగా ఈ గ్లింప్స్‌ను 'పెద్ది' మూవీతో థియేటర్లలో స్క్రీనింగ్ చేయడం వల్ల రెండు సినిమాలకూ భారీ మైలేజ్ లభిస్తుందని ట్రేడ్ అనలిస్టులు విశ్లేషిస్తున్నారు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో చరణ్ నటిస్తున్న 'పెద్ది' ఒక ఇంటెన్స్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతోంది. నార్త్ అమెరికాలో ఇప్పటికే రికార్డు బుకింగ్స్ నమోదు చేసిన ఈ సినిమా ఇప్పుడు 'డ్రాగన్' గ్లింప్స్ అప్‌డేట్‌తో మరింత హైప్‌ను మూటగట్టుకుంది. మొత్తానికి జూన్ మొదటి వారంలో థియేటర్ల వద్ద రామ్ మరియు భీమ్ ల పవర్ మరోసారి కనిపించబోతోంది.




## చియాన్ 63 షూటింగ్ అప్డేట్..

ఈ ఏడాది 'వీర ధీర శూరన్2'తో ప్రేక్షకులను అలరించిన కోలీవుడ్ స్టార్ హీరో చియాన్ విక్రమ్.. ఇప్పుడు తన 63వ చిత్రం కోసం సిద్ధం అవుతున్నాడు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన అప్డేట్ ఒకటి వచ్చింది. ఆనంద్ శంకర్ దర్శకత్వంలో సత్యజ్యోతి ఫిలిమ్స్ నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం షూటింగ్ జూన్ మొదటి వారంలో ప్రారంభం కానుంది. ఈ చిత్రాన్ని చెన్నై, దాని పరిసర ప్రాంతాలలో చిత్రీకరించనున్నారు. అంతే కాకుండా ఈ ప్రాజెక్ట్ కోసం చియాన్ విక్రమ్ సుమారు 50 నుండి 60 రోజుల కాల్ షీట్‌ను కేటాయించారట. ఇదిలా ఉంటే.. ఈ చిత్రం ద్వారా యంగ్ బ్యూటీ రియాషిబు నటిగా తమిళ చిత్రసీమలోకి అడుగుపెడుతోంది. ఆమె ఈ సినిమాలో ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని తెలుస్తుండగా.. హీరోయిన్ ఎవరనేది ఇంకా క్లారిటీ రావాల్సి ఉంది. ఇక వీరే కాకుండా.. ఊర్వశి, ఎంఎస్ భాస్కర్ కూడా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఒక ప్రత్యేకమైన, విభిన్నమైన చిత్రంగా రూపొందించాలని చిత్ర బృందం యోచిస్తుండగా.. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు రావాల్సి ఉంది.



## గ్లిమ్స్ కోసం మూడు రోజులుగా వర్క్ చేస్తున్న రవి బస్రూర్

గ్లోబల్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్ - మాస్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం డ్రాగన్. ఈ సినిమా అనౌన్స్‌మెంట్ నుండే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొనగా ఇప్పుడు ఎన్టీఆర్ పుట్టినరోజు మే 20 సందర్భంగా విడుదల కానున్న ప్రత్యేక గ్లింప్స్ గురించి ఒక ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ నగర్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది.

ఈ సినిమాకు ప్రాణం పోసే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కోసం సంగీత దర్శకుడు రవి బస్రూర్ గత మూడు రోజులుగా నిర్విరామంగా పని చేస్తున్నారు. ప్రశాంత్ నీల్ సినిమాల్లో యాక్షన్ సీక్వెన్స్‌లకు రవి బస్రూర్ ఇచ్చే మ్యూజిక్ ఎలాంటి ఎలివేషన్ ఇస్తుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. 'డ్రాగన్' గ్లింప్స్ కోసం రవి బస్రూర్ ఒక పవర్‌ఫుల్ అండ్ యూనిక్ స్కోర్‌ను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. దర్శకుడు ప్రశాంత్ నీల్ ఈ గ్లింప్స్‌ను చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇప్పటివరకు ఆయన కెరీర్‌లో వచ్చిన 'కేజీఎఫ్', 'సలార్' వంటి చిత్రాల టీజర్లు మరియు గ్లింప్స్ వీడియోలను మించేలా 'డ్రాగన్' గ్లింప్స్ ఉండాలని ఆయన ప్లాన్ చేస్తున్నారట. ఎన్టీఆర్ మాస్ ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకుని విజువల్స్ మరియు సౌండ్ పరంగా ఒక కొత్త అనుభూతిని ఇచ్చేందుకు ప్రశాంత్ నీల్ టీమ్ కష్టపడుతోంది. ఈ గ్లింప్స్‌తో సినిమా కథాంశంపై ఒక చిన్న క్లూ ఇవ్వడంతో పాటు ఎన్టీఆర్ లుక్‌ను చాలా పవర్‌ఫుల్‌గా ప్రెజెంట్ చేయబోతున్నారని తెలుస్తోంది. మే 20న రానున్న ఈ 'డ్రాగన్' గ్లింప్స్ కోసం నందమూరి అభిమానులు సోషల్ మీడియాలో ఇప్పటికే రచ్చ మొదలుపెట్టారు. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను నిర్మిస్తున్నాయి.




The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.